

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

02.08.2026
ఆదివారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 81
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## భోగాపురంతో ఉత్తరాంధ్రకు

# కొత్త ఊపు



### భోగాపురం ఎయిర్‌పోర్ట్ జాతికి అంకితం: మోదీ

- రూ.18,000 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- ఉత్తరాంధ్ర వికాసానికి కొత్త రన్‌వే: మోదీ
- అల్లూరి పేరుతో విమానాశ్రయానికి గౌరవం
- ఉడాన్‌తో సామాన్యులకు విమాన ప్రయాణం
- ఏపీ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోంది: మోదీ

భోగాపురం, ఆగస్టు 01,
అనంత జనశక్తి న్యూస్
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో మరో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా జాతికి అంకితం చేశారు. దీనితో పాటు రాష్ట్ర సమగ్ర పురోగతికి ఊతమిచ్చే రూ.18,000 కోట్ల విలువైన వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని అందరికీ నమస్కారం అని తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. సింహాచలం అప్పన్న స్వామికి, విజయనగరం పైడితల్లి అమ్మవారికి శిరస్సు వంచి ప్రణామాలు సమర్పించారు.



2లో..

### ఉత్తరాంధ్ర ఇకపై ఉత్తమ ఆంధ్ర

- సీఎం చంద్రబాబు నాయుడు
- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం
- రాష్ట్ర పునర్నిర్మాణ హామీ నెరవేర్చాం
- ఉత్తరాంధ్రలో 8 ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి

భోగాపురం, ఆగస్టు 1,
అనంత జనశక్తి న్యూస్
ఉత్తరాంధ్ర ఇకపై అభివృద్ధిలో ఉత్తమ ఆంధ్రగా ఉండబోతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంతో ఉత్తరాంధ్ర దశదిశ మారబోతోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

6లో..



### క్షమించే గుణం మోదీది

- దూషించే వారిని కూడా క్షమిస్తారు
- డిప్యూటీ సీఎం పవన్

తెలుగుజాతి ఎవరికీ తలవంచదు

2లో..

### ఎర్రబస్సు రాని చోట ఎయిర్‌బస్సు

- ఇదే ఉత్తరాంధ్ర దెబ్బ: మంత్రి లోకేష్ వెల్లడి
- వికసిత్ భారత్‌కు భోగాపురం ప్రతిరూపం
- ఏపీ గ్రోత్ ఇంజన్‌గా ఉత్తరాంధ్ర

6లో..



## స్వాతంత్ర్యం అంటే అది కాదు!

- జెన్ జీ నిరసనల నేపథ్యంలో..
- ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్ వ్యాఖ్య



2లో..

న్యూఢిల్లీ, ఆగస్టు 01,
అనంత జనశక్తి న్యూస్
నీట్ పేపర్ లీక్‌పై జెన్ జీ నిరసనల నేపథ్యంలో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం అంటే ఇష్టారీతిన వ్యవహరించగలిగే అపరిమిత స్వేచ్ఛ కాదని అన్నారు. పూణెలో హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా లోకమాన్య తిలక్ జాతీయ అవార్డు స్వీకరించిన అనంతరం డోభాల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

## ఏడాదిలో 10.23 శాతం వృద్ధి

- 2025-26 ఆర్థిక సంవత్సరంలో
- రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931
- సీఎం రేవంత్ కామెంట్
- కొత్త శిఖరాలకు తెలంగాణ రైజింగ్
- గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగింది
- తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని కామెంట్



హైదరాబాద్, ఆగస్టు 01,
అనంతజనశక్తి న్యూస్
తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

2లో..

### రీల్స్‌లోనే క్షమిస్తారా.. కేసులూ ఎత్తేస్తారా..?

- ప్రధాని మోదీకి సీజేపీ అధినేత అభిజీత్ ప్రశ్న



న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్
విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

2లో..

## ఫేక్ న్యూస్‌పై కేటీఆర్ ఫైర్

- ఫేక్ న్యూస్‌ను ఫ్యాక్ట్ చెక్ చేయాలి: కేటీఆర్
- ప్రగతి భవన్‌పై తప్పుడు ప్రచారం జరిగిందని ఆరోపణ
- కాళేశ్వరం కుంభకోణ ప్రచారం ఫేక్ న్యూస్ కాదా? అని ప్రశ్న
- సోషల్ మీడియా వల్ల జవాబుదారీతనం వచ్చిందని వ్యాఖ్య
- జెన్‌జీ దెబ్బకు మోదీ అర్ధరాత్రి వీడియో పెట్టారని కేటీఆర్ విమర్శ



2లో..

హైదరాబాద్, ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్
సోషల్ మీడియా ద్వారా ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మీడియాలో, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వస్తే అవును తప్పకుండా (ఫ్యాక్ట్ చెక్) నిజాలను నిర్ధారించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం-ప్రజాస్వామ్యం-పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు.

### ఎర్రబస్సులు కాదు.. ఎయిర్ బస్‌లు తిరిగే ప్రాంతం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

2లో..



భోగాపురం, ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్
ప్రపంచం మొత్తం ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఎర్రబస్సులు కాదు.. ఎయిర్ బస్‌లు తిరిగే ప్రాంతమని నిరూపించామన్నారు.

## ఒక్కరోజులో రికార్డు స్థాయిలో 2.20 లక్షల లావాదేవీలు

- మీసేవలో చరిత్రాత్మక రికార్డు
- మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన
- రాష్ట్ర ఈ-గవర్నెన్స్ వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం

7లో..



హైదరాబాద్, ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్
తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ పాలనకు ప్రతీకగా నిలిచిన మీసేవ సేవలు మరో అరుదైన ఘనతను సాధించాయి. గతంలో రోజుకు సగటున 80 వేల వరకు మాత్రమే నమోదయ్యే లావాదేవీలు, తాజాగా ఒక్కరోజులోనే 2.20 లక్షలకు చేరుకోవడం విశేషమని శ్రీధర్ బాబు తెలిపారు.

## కేరళలో కుండపోత

- కొండచరియలు విరిగిపడి
- ముగ్గురు మృతి.. 8 జిల్లాల్లో రెడ్ అలర్ట్
- కొట్టాయంలో యువకుడు మృతి

2లో..

తిరువనంతపురం, ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్
కేరళను భారీ వర్షా లు వణికిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా లకు పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. శనివారం ఇడుక్కి, కొట్టాయం జిల్లాల్లో చోటుచేసుకున్న వేర్వేరు కొండచరియల ఘటనల్లో ముగ్గురు మరణించగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు.



## ఉధృతంగా గోదావరి ప్రవాహం

### తీరప్రాంత వాసుల్లో భయాందోళనలు



2లో..

అమరావతి, ఆగస్టు 01, అనంతజనశక్తి న్యూస్
రాజమండ్రి రివర్ ఫ్రంట్ వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గట్టు తీవ్రంగా కోతకు గురవుతోంది. నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో నదీ ప్రవాహ వేగానికి మట్టి కొట్టుకుపోతుండటంతో గోదావరి గట్టు ప్రమాదంలో పడింది. దీంతో చుట్టుపక్కల నివసించే స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం | అనంతపురం
02.08.2026



# ఉధృతంగా గోదావరి ప్రవాహం



(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి తీవ్రతను గ్రహించిన రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే అప్రమత్తమయ్యారు. కోతకు గురవుతున్న ప్రాంతాలను పరిశీలించి, మరింత నష్టం జరగకుండా నివారించేందుకు అత్యవసర చర్యలు చేపట్టారు. నదీ తీరంలో కోతను అరికట్టేందుకు భారీగా ఇసుక బస్తాలను వేస్తూ రక్షణ గోడగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరిలో నీటిమట్టం వేగంగా పెరుగుతున్నప్పటికీ, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు ధైర్యం చెప్తున్నారు. ప్రవాహ ఉధృతి పెరిగినా తట్టుకునేలా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపడుతున్నామని, నీటిమట్టం మరో ఐదు అడుగులు పెరిగినా ఎటువంటి ప్రమాదం ఉండదని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ సిబ్బంది నిరంతరం తీర ప్రాంతంలోనే ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

వరద ఉధృతి ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున నదీ తీర ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని, నదిలోకి దిగవద్దని అధికారులు హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

# స్వాతంత్ర్యం అంటే అది కాదు!

(మొదటిపేజీ తరువాయి)



స్వాతంత్ర పోరాటం నాటి త్యాగాలు, విలువలకు యువత ప్రతిబింబంగా నిలవాలని అన్నారు. వ్యక్తులకు స్వేచ్ఛతో పాటు సమాజం, దేశం విషయంలో బాధ్యతలు కూడా ఉంటాయన్న విషయాన్ని అర్థం చేసుకోవాలని అన్నారు. 'భారత్ గతంలో కూడా ఇలాగే ఉండేదని కొందరు యువత అనుకుంటూ ఉండవచ్చు. లేదా స్వాతంత్ర్యం అంటే ఇష్టారీతిన వ్యవహరించగలిగే అపరిమిత స్వేచ్ఛ అని పొరపాటుపడుతూ ఉండొచ్చు. కానీ స్వాతంత్రం అంటే అది కాదు' అని అన్నారు. ప్రజాస్వామిక స్వేచ్ఛతో పాటు దేశం పట్ల బాధ్యత కూడా కలిగి ఉండాలని సూచించారు. స్వాతంత్ర సమర యోధుడు బాల గంగాధర్ తిలక్ జీవితం నుంచి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. 'ఆయన చెప్పిన విషయాల గురించి యువత లోతుగా ఆలోచించాలి. భారత భవిష్యత్తు, జాతి నిర్మాణం గురించి ఆయనకున్న ఆలోచనల గురించి తెలుసుకోవాలి' అని అన్నారు.

**డోభాల్‌పై హోం మంత్రి ప్రశంసలు..**

అవార్డు ప్రదానం సందర్భంగా హోం మంత్రి అమిత్ షా అజిత్ డోభాల్‌పై ప్రశంసలు కురిపించారు. భారత విదేశాంగ విధానం, జాతీయ భద్రతా విధానాలను ఆయన బలోపేతం చేశారని అన్నారు. జాతీయ భద్రతకు సంబంధించి ప్రధాని తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక డోభాల్ పాత్ర, సూచనలు ఉంటాయని అన్నారు. చరిత్రలో డోభాల్‌కంటూ ఒక బంగారు పేజీ ఉంటుందని వ్యాఖ్యానించారు.

# భోగాపురంతో ఉత్తరాంధ్రకు కొత్త ఊపు



(మొదటి పేజీ తరువాయి)

ఏపీ ప్రగతిలో ఒక శుభదినమని, రూ.18,000 కోట్ల ప్రాజెక్టులు రాష్ట్ర రూపురేఖలను వేగంగా మారుస్తాయని ధీమా వ్యక్తం చేశారు ప్రధాని మోదీ. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కేవలం విమానాల రాకపోకలకే పరిమితం కాదని, ఇది ఉత్తరాంధ్ర వికాసానికి కొత్త రన్‌వేగా, ఆంధ్రా యువత కలలకు లాంచ్‌పాడ్‌లా ఉపయోగపడుతుందని కొనియాడారు. గతంలో విమానాశ్రయం నిర్మిస్తే ఒకే కుటుంబం పేర్లు పెట్టే సంస్కృతి ఉండేదని.. కానీ తమ ప్రభుత్వం అయోధ్యలో మహర్షి వాల్మీకి, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేర్లు పెట్టినట్లే, ఇక్కడ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో గౌరవించుకున్నామని మోదీ గుర్తుచేశారు. 2014 నాటికి దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవి. కానీ గడిచిన 12 ఏళ్లలో కొత్తగా 166 విమానాశ్రయాలను నిర్మించి మొత్తం సంఖ్యను భారీగా పెంచామన్నారు. ఉడాన్ పథకం ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజలు కూడా తమ సొంత ప్రాంతాల నుంచే విమానం ఎక్కేలా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు ఉన్న పాత రేవులను ఆధునీకరించడంతో పాటు, మూలపేట, రామాయపట్నంలో నూతన పోర్టులు నిర్మిస్తున్నామని ప్రధాని మోదీ చెప్పారు. ఏపీలో ప్రస్తుతం రూ. లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనులు నడుస్తున్నాయని వివరించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుతోందని, గ్లోబల్ ఇన్వెస్టర్లు తరలివస్తున్నారని పేర్కొన్నారు.

# రీల్స్‌లోనే క్షమిస్తారా.. కేసులూ ఎత్తేస్తారా..?

న్యూఢిల్లీ, ఆగస్ట్ 1, అనంత జనశక్తి న్యూస్:

విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకుంటారా?' అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

ఈ వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, 'క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?" అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించిన వీడియోను ప్రస్తావిస్తూ, 'ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీకి మరొకటా?' అని విమర్శించారు .

కాగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ బాలికపై కేసు నమోదైంది . తాజాగా ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పింది. తాను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కాగా, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.





# కేరళలో కుండపోత

(మొదటి పేజీ తరువాయి)



ఇడుక్కి జిల్లాలోని అదుర్మల ప్రాంతంలో భారీ కొండచరియ ఇంటిపై పడటంతో సుమతి అనే మహిళ మృతి చెందారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఉన్న ఆమె భర్త, కుమారుడిని స్థానికులు రక్షించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. NDRF, అగ్నిమాపక, రక్షణ సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి చేపట్టిన గాలింపు చర్యల్లో సుమతి మృతదేహాన్ని వెలికితీశారు.

**కొట్టాయంలో యువకుడు మృతి**

కొట్టాయం జిల్లాలోని పూంజర్ తాలూకా పయ్యనితొట్టంలో కొండచరియలు విరిగిపడటంతో జోసెఫ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని శిథిలాల నుంచి బయటకు తీసి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అతని తల్లి కూడా శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు భావిస్తుండటంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

**వాగమోన్‌లో మరో విషాదం**

ఇడుక్కి జిల్లాలోని వాగమోన్ ప్రాంతంలో మరో కొండచరియల ఘటన చోటుచేసుకుంది. కొట్టాయం జిల్లాకు చెందిన ప్రభాకరన్ నాయర్ బంధువుల ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కొండచరియలు విరిగిపడి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. గంటలపాటు కొనసాగిన సహాయక చర్యల అనంతరం ఆయన మృతదేహాన్ని వెలికితీశారు. ఇడుక్కి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియల కారణంగా జనజీవనం స్తంభించింది.

ఉప్పుతారలో కొండచరియలు విరిగిపడి అక్కడ నిలిపి ఉంచిన పోలీసు వాహనం దెబ్బతింది. పుల్లకయార్ నది పొంగిపొర్లడంతో కొక్కయార్ లోయర్ క్రాసింగ్ నీట మునిగింది. పరిసర ప్రాంతాల్లోని పలు ఇళ్లు నీట మునగడంతో బాధిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కట్టప్పనవాజవర రహదారిపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వండిపెరియార్ ప్రాంతంలో నీటిమట్టం పెరగడంతో జాతీయ రహదారి 183పై కూడా వరద ప్రభావం కనిపించింది.

**కొట్టాయం జిల్లాలో భారీ వరదలు**

భారీ వర్షాలతో కొట్టాయం జిల్లాలోని ఎరట్టుపేట, కంజిరప్పల్లి, కూట్టిక్కల్, ఎరుమేలి ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఎరట్టుపేటలో రాత్రికి రాత్రే నీటిమట్టం పెరగడంతో అనేక ఇళ్లు నీట మునిగాయి. ఇళ్ల పై అంతస్తుల్లో చిక్కుకున్న ప్రజలను స్థానికులు, సహాయక సిబ్బంది కలిసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మణిమల, పుల్లకయార్ నదులు ఉప్పొంగడంతో కూట్టిక్కల్, ముండక్కయం ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**పతనంతిట్టలోనూ ప్రమాదకర పరిస్థితులు**

పతనంతిట్ట జిల్లాలోని కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో పంపా నది నీటిమట్టం వేగంగా పెరిగింది. రాణి తదితర ప్రాంతాల్లో చిక్కుకుపోయిన ప్రజలను రక్షించేందుకు అధికారులు పడవలను మోహరించి, సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. మధ్య కేరళతో పాటు కొల్లాం, కోజికోడ్, మలప్పురం, పాలక్కాడ్ జిల్లాల్లోనూ భారీ వర్షాలు, వరదలు, చిన్నపాటి కొండచరియల ఘటనలు నమోదయ్యాయి. కోజికోడ్‌లోని చాలియం వద్ద భారీ అలల్లో చిక్కుకున్న చేపల పడవ నుంచి మత్స్యకారులను సురక్షితంగా రక్షించారు.

**8 జిల్లాలకు రెడ్ అలర్ట్**

భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో కేరళలోని పతనంతిట్ట, కొట్టాయం, ఇడుక్కి, మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఎర్నాకులం, త్రిస్సూర్, పాలక్కాడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

**విద్యాసంస్థలకు సెలవులు**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదలు, కొండచరియల ప్రమాదాల నేపథ్యంలో పలు జిల్లాల్లో జిల్లా యంత్రాంగాలు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాయి. సహాయక, రక్షణ బృందాలను అప్రమత్తం చేసి, ప్రమాదకర ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం, లోతట్టు ప్రాంతాల్లో ఆకస్మిక వరదల ముప్పు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో కొండ ప్రాంతాలు, నదులు, వాగులు, వరద ప్రభావిత రహదారుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కేరళలో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో పరిస్థితిని అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. తాజా వాతావరణ హెచ్చరికలు, స్థానిక అధికారుల సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలి.

# క్షమించే గుణం మోదీది



భోగాపురం, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్

140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను ప్రధాని మోదీ సాకారం చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని మోదీ జాతికి అంకితం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు.

"తెలుగుజాతి ఎవరికీ తలవంచదని అల్లూరి గర్జించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్టు సరికొత్త అధ్యాయం. చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఏపీ అగ్రగామి రాష్ట్రంగా అభివృద్ధి చెందుతోంది. దేశ ప్రగతికి మౌలిక వసతుల కల్పనే కీలకమని ప్రధానికి తెలుసు. అందుకే.. రైల్వే జోన్ ఇచ్చి ఇక్కడి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారు. ఈ దేశాన్ని వికసిత్ భారత్ దిశగా నడిపిస్తున్నారు. కష్టపడి పనిచేస్తున్న ప్రధానికి చాలా అవమానాలు ఎదురయ్యాయి. దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలంటే ఎంత కష్టమో ఆలోచించాలి. దిల్లీ జంతర్‌మంతర్‌లో ప్రధానిని విమర్శిస్తుంటే చాలా బాధపడ్డా. ఎన్ని బాధలు పడ్డా.. వెనక్కి లాగుతున్నా.. మోదీ ఎక్కడా భయపడలేదు. కాయలు కాసే చెట్టుకే రాళ్ల దెబ్బలు తగలడం సహజం. తనను దూషించే వారిని కూడా క్షమించే గుణం మోదీది. సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న ప్రధానికి మనం ఏం ఇవ్వగలం. దేశానికి ఇలాంటి ప్రధాని రావడం మనందరి అదృష్టం" అని పవన్ అన్నారు. కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబుతో పాటు పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు పాల్గొన్నారు.

**మోడీని మించిన నాయకుడు లేరు**

ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని వికసిత్ భారత్ దిశగా ముందుకు నడిపిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ, మోదీ దేశం కోసం చేస్తున్న కృషి కొత్త తరానికి పూర్తిగా తెలియాల్సిన అవసరం ఉందన్నారు. జంతర్‌మంతర్‌లో ప్రధానిని అనుచిత పదజాలంతో విమర్శించిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పవన్ తెలిపారు. ప్రధాని మోదీపై ఎవరైనా విమర్శలు చేస్తే, అది తమందరిపైనా చేసినట్లేనని వ్యాఖ్యానించారు. నేటి యువతకు దేశ నాయకుల పట్ల గౌరవం, సరైన సంస్కారం నేర్పాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశానికి సేవ చేయడంలో ప్రధాని మోదీ ఎలాంటి సెలవులు తీసుకోకుండా నిరంతరం శ్రమిస్తున్న మహానేత అని పవన్ కల్యాణ్ కొనియాడారు. దేశాన్ని నడిపించడం రామకార్యంలాంటిదని, అలాంటి గొప్ప బాధ్యతను మోదీ సమర్థంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. దేశం కోసం అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇక, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్న పవన్, ఒకప్పుడు "ఎర్రబస్సు కూడా రాదు" అని విమర్శించిన ప్రాంతంలో నేడు అంతర్జాతీయ విమానాశ్రయం రావడం అభివృద్ధికి నిదర్శనమన్నారు. ప్రధాని మోడీని మించిన నాయకుడు మరొకరు లేరని, భవిష్యత్తులో కూడా అలాంటి నాయకత్వం అరుదేనని వ్యాఖ్యానించారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

# ఏడాదిలో 10.23 శాతం వృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

**తలసరి ఆదాయంలో సరికొత్త రికార్డు**

రాష్ట్ర ఆర్థిక పురోగతికి అద్దం పడుతూ 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4,18,931కి చేరింది. గత ఏడాదితో పోలిస్తే ప్రజల తలసరి ఆదాయంలో ఏకంగా రూ. 38,900 పెరుగుదల నమోదవ్వడం విశేషం. కేవలం ఒకే ఏడాది వ్యవధిలో 10.23% వృద్ధి రేటును సాధించి తెలంగాణ ఆర్థికంగా బలమైన శక్తిగా ఎదిగిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**పారదర్శక పాలనతో నూతన ఉత్సాహం**

గత దశాబ్ద కాలంగా ఉన్న లోపాలను, అస్తవ్యస్తమైన పరిపాలనా విధానాలను సరిదిద్ది, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం తెలిపారు. సమర్థవంతమైన ప్రణాళికలు, సుపరిపాలన , ఆర్థిక క్రమశిక్షణే ఈ అసాధారణ వృద్ధికి ప్రధాన కారణాలని ఆయన అభిప్రాయపడ్డారు. నాటి లోపాలను సరిదిద్దడం ద్వారా నేడు ప్రజల్లో నూతన ఉత్సాహం, నమ్మకం నింపగలిగామని, ఇదే వేగంతో రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**సీఎం రేవంత్ రెడ్డి ఫారిన్ టూర్**



తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో కీలక విదేశీ పర్యటనకు రెడీ అవుతున్నారు. ఆగస్ట్ 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు దాదాపు 20 రోజుల పాటు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)తో పాటు మరికొన్ని దేశాల్లో పర్యటించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

ప్రపంచస్థాయి కంపెనీలు, మల్టీ నేషనల్ కంపెనీలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణలో పెట్టుబడులు పెంచే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు. ఈ విదేశీ పర్యటనలో ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ వంటి వ్యూహాత్మక రంగాలపై తెలంగాణ ప్రభుత్వం ప్రధాన దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ రంగాల్లో అగ్రగామి సంస్థల ప్రతినిధులతో సమావేశాలు జరగనున్నాయి. లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యాసంస్థల ప్రతినిధులతోనూ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. గతంలో జరిగిన విదేశీ పర్యటనల్లో తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల (ఎంఓయూల) అమలు పురోగతిని కూడా సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించే అవకాశం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన లేదా కొత్తగా పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్న అంతర్జాతీయ కంపెనీలతో సమావేశాలు నిర్వహించి మరిన్ని ప్రాజెక్టులను రాష్ట్రానికి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్, ఫ్యూచర్ సిటీ, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు (జీసీసీలు), స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలను పెట్టుబడిదారులకు వివరించే అవకాశముంది. ఇదిలా ఉండగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ షెడ్యూల్‌పైనా కసరత్తు కొనసాగుతోంది. చట్టసభల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ ఆగస్ట్ నెల మధ్యలో ఒకరోజు ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు ఇప్పటికే ప్రభుత్వ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. అలాగే వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబర్ మూడో వారంలో నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

విదేశీ పర్యటన ముగించుకుని సీఎం రేవంత్ రెడ్డి సెప్టెంబర్ రెండో వారంలో రాష్ట్రానికి చేరుకున్న తర్వాత అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# ఫేక్ న్యూస్‌పై కేటీఆర్ ఫైర్



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రగతి భవన్‌లో కేసీఆర్ క్యాంప్ ఆఫీస్ పెడితే 150 బెడ్‌రూమ్‌లున్నాయని ప్రచారం చేశారు..మరి ఇప్పుడక్కడ ఎవరుంటున్నారు..? ఉన్నాయా 150 బెడ్‌రూమ్‌లు. అందులో బంగారు కప్‌బోర్డులున్నాయన్నారు. ఆ ఫేక్ న్యూస్ వ్యాపింపచేసింది ఎవరు..? రూ.84 వేల కోట్ల ఖర్చయిన కాళేశ్వరం ప్రాజెక్టును రూ.లక్ష కోట్ల కుంభకోణమని ప్రచారం చేశారు. అది ఫేక్ న్యూస్ కాదా..? ఇవన్నీ కూడా ఖచ్చితంగా ప్రశ్నించాలన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌లో ఎవరో సినిమా యాక్టర్ల ఫోన్లు మీడియాను అడ్డం పెట్టుకుని ట్యాప్ చేశామని ప్రచారం చేశారు.. ఫోన్ ట్యాపింగ్‌లో నన్ను విచారణకు పిలిస్తే పోయాను. ఏ యాక్టర్ల ఫోన్లు ట్యాప్ అయ్యాయి.. చెప్పు స్వామి కొద్దిగా నంబర్లు ఇయ్యమని అడిగా. ఎవరివీ కాలేదు సార్ అన్నడు. మరి ఎవరివీ కాకపోతే మీడియాకు చెప్పొచ్చు కదా ఇదేంది సోది అంటే.. చెప్పాను సార్ అని ఆ ఏసీపీ అన్నారు. ఎవరికి చెప్పారంటే ఆ పత్రికకు మాత్రం చెప్పానన్నారు.

ఈ సోషల్ మీడియా వచ్చిన తర్వాత మేం కూడా బాధితులమే.. అధికారంలో ఉన్నవాళ్లు మాత్రమే కాదని కేటీఆర్ పేర్కొన్నారు. నిజం గడప దాటేలోపే అబద్ధం అంగీ లాగేసుకుని ఊరంతా తిరిగి వచ్చేస్తుంది, ఇది వాస్తవం. అందరం బాధితులమే. ఇందులో కాదనడానికి ఏం లేదు. వాస్తవాలు వాస్తవాలే కదా.. జరుగనివి జరిగినట్టుగా ఉన్నవి లేనట్టుగా లేనివి ఉన్నట్టుగా చూపిస్తున్నారన్నారు.

జెన్ జీ దెబ్బకు మోదీ అర్ధరాత్రి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పెట్టాల్సి వచ్చింది

ఇటీవల నీట్ స్కాంకు సంబంధించిన కాక్రోచ్ జనతా పార్టీ యువత ఆందోళనను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావిస్తూ.. యువతరం కదం తొక్కింది.. ఒక కొత్తతరం ఆందోళన అని అన్నారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం - ప్రజాస్వామ్యం - పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగిస్తూ.. కొత్త తరహా ఆలోచన ఢిల్లీ పుర వీధుల్లో కదం తొక్కితే ముందెవరూ నమ్మలేదన్నారు. యువత ఆందోళనతో ప్రభుత్వం మాత్రమే వణకలేదు.. ఒక రకంగా చెప్పాలంటే మీడియాకు కూడా చెమటలు పట్టించింది. మీకు గుర్తుండాలి.. భజన మీడియాకు అయితే మొత్తం బల్బులు ఎగిరిపోయినయి. అక్కడిపోతే పిల్లలు 20 రోజుల తర్వాత మేం గుర్తొచ్చామా... అని గోదీ మీడియాను డైరెక్టుగా నిలదీస్తుంటే చెమటలు పట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ఎందుకంటే ఆ పిల్లల మీద ఈడీ పనిచేయదు.. సీబీఐ పని చేయదు.. ఐటీ పనిచేయదు.. దేనికీ భయపడే బ్యాచ్ కాదది అన్నారు. అందుకే మొన్న చెప్పాను. మోదీ ఎవరితోనైతే పెట్టుకోవద్దన్నానో డైరెక్టుగా వాళ్లతోనే పెట్టుకున్నాడు. ఈ పిల్లలు మామూలోళ్లు కాదు.. మొన్న జరిగిన పోరాటం కూడా వాట్సాప్ యూనివర్సిటీ అంకుల్స్‌కు, ఇన్‌స్టాగ్రామ్ పిల్లలకు మధ్యలో జరిగిన పోరాటం. మొదటి రౌండ్‌లో ఎవరు గెలిచారో మీరు చూశారన్నారు కేటీఆర్. అర్ధరాత్రి జెన్ జీ దెబ్బకు మోదీ అర్ధరాత్రి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పెట్టాల్సి వచ్చిందని కేటీఆర్ అన్నారు. సోషల్ మీడియాలో కొంతమంది మిత్రులు, మహేశ్ గౌడ్ కూడా మాట్లాడుతూ.. ఫేక్ న్యూస్ కూడా కొన్ని హద్దులు దాటకపోతే బాగుంటుందని అన్నారు. కానీ ఎవరు గీయాలి హద్దులు ప్రభుత్వాలా..? హద్దులు మరి ఎవరు గీస్తారు..? సంప్రదాయ మీడియానేమో మేనేజ్ చేశారు.. చివరకు ఇక్కడ మేము రాస్తాం.. అప్పుడు పాజిటివ్, అప్పుడప్పుడు నెగెటివ్ వార్తలు రాస్తాం. ఉన్నవి ఉన్నట్టు రాస్తాం.. కానీ యాడ్స్ మాత్రం ఆపకండి..అని అడిగే పరిస్థితి వచ్చిందంటే..? పరిమితులు, స్వేచ్ఛకు హద్దులు పెడిగే ఇక అది వాక్ స్వాతంత్ర్యం, స్వేచ్ఛా ఎట్లా అవుతుందన్నారు కేటీఆర్. స్వేచ్ఛకు పరిమితులుండకూడదు. వాక్ స్వాతంత్ర్యం ఇచ్చాం కాబట్టి దూషణలతో దాడి చేయండి.. వాడి వేడి మాటలతో బూతులు తిట్టండి అని కాదు..కానీ ఖచ్చితంగా ఇవాళ సోషల్ మీడియా లేకపోతే ప్రభుత్వాల్లో ఈ చలనల వచ్చేది కాదు..జవాబు దారితనం కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు.

# ఎర్రబస్సులు కాదు.. ఎయిర్ బస్‌లు తిరిగే ప్రాంతం

(మొదటిపేజీ తరువాయి)

**భోగాపురం విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి మాట్లాడారు. "ఉత్తరాంధ్ర ప్రాంతంలో భోగాపురం విమానాశ్రయం సింహద్వారంలా ఉంది. ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఎర్రబస్సులు తిరిగే ప్రాంతమని కొందరు హేళన చేశారు. ఇవాళ కళ్లు తెరిచి చూడండి.. ఎయిర్ బస్సు తిరిగే ప్రాంతంగా మారింది. ఎక్కడా జరగని అభివృద్ధి ఉత్తరాంధ్రలో జరుగుతోంది. ప్రపంచం గర్వించదగ్గ నాయకుడు మోదీ. సీఎం చంద్రబాబు నాయకత్వంలో విజన్ 2047, ప్రధాని మోదీ సారథ్యంలో వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా పెట్టుకున్నాం" అని రామ్మోహన్ నాయుడు వివరించారు.**

# కాక్రోచ్‌లు దేన్నైనా మార్చగలవు: పాకిస్థాన్ మంత్రి నఖ్వీ



భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీ సృష్టించిన విధ్వంసం తెలిసిందే. అయితే పాకిస్థాన్‌లో కాక్రోచ్ జనతా పార్టీ తరహాలో యువత ఉద్యమిస్తున్నట్లు వార్తలు వెలుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ దేశ హోంశాఖ మంత్రి మోషిన్ నఖ్వీ కీలక వ్యాఖ్యలు చేశారు. యువత తలుచుకుంటే దేన్నైనా మార్చగలరని అన్నారు. వాళ్లు(కాక్రోచ్‌లు) ఐక్యం అయితే ఏదైనా సాధ్యమే అన్న రీతిలో ఆయన స్పందించారు. పాకిస్థాన్ ప్రభుత్వ వ్యవస్థలో సూక్ష్మ స్థాయిలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇస్లామాబాద్‌లో జరిగిన పాకిస్థాన్ ఎకనామిక్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రస్తుత వ్యవస్థ కుప్పకూలిందని, పెరుగుతున్న దేశ సవాళ్లను ఈ వ్యవస్థ ఎదుర్కొనే సామర్థ్యంలో లేదన్నారు. మనం నివసిస్తున్న వ్యవస్థ కుప్పకూలిందని, దీంతో సమస్యలను తీర్చలేమని ఆయన అన్నారు. సంస్థాగత సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన వార్నింగ్ ఇచ్చారు. మరో పదేళ్ల తర్వాత కూడా ఇలాంటి సమస్యలతోనే పాకిస్థాన్ బాధపడాల్సి వస్తుందని అన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొన్నది. నిరుద్యోగం, రాజకీయ వైరుధ్యాలు, భద్రతా సవాళ్లు ఎదురవుతున్నాయి. బలోచిస్తాన్, ఖైబర్ ఫుక్తున్‌క్వాలో భద్రత పెను సమస్యగా మారింది.

అయితే ఇటీవల సీజేపీ నేతృత్వంలో భారత్‌లో సాగిన ఉద్యమాన్ని పాకిస్థాన్ స్టడీ చేస్తున్నట్లు తెలిసింది. సంస్కరణల గురించి మాట్లాడిన మంత్రి నఖ్వీ.. నిర్వీర్య దశలోనే ఉన్న దేశ యువతను ఉద్దేశిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. యువతను ఏమైనా పిలవండి, యువకుడా లేకా కాక్రోచా లేక ఇంకేదైనా అనండి, ఒకవేళ ఈ కాక్రోచ్‌లు ఏకం అయితే, వాళ్లు దేన్నైనా మార్చగలరని అన్నారు. పాకిస్థాన్ సమస్యలన్నీ మిలిటరీ నాయకత్వంతో పరిష్కరించలేమని, ఎయిర్ చీఫ్ మార్షల్ అసిమ్ మునీర్ ఎన్ని చేసినా.. విస్తృత స్థాయిలో వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టాల్సి ఉంటుందని మంత్రి నఖ్వీ తెలిపారు.

# కేరళలోని ఇడుక్కిలో భారీ వర్షాలు.. కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి

కేరళను భారీ వర్షాలు ముంచెత్తాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వరదలు సంభవిస్తున్నాయి. కొండచరియలు కూడా విరిగి పడుతున్నాయి. కేరళ, ఇడుక్కి, కొట్టాయం జిల్లాల్లో శనివారం భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ముగ్గురు మరణించారు. అలాగే, ఈ శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. వాగమాన్ జిల్లాలో కూడా కొండచరియలు విరిగిపడటం వల్ల ఒకరు మరణించారు. ప్రభాకరన్ నాయర్ అనే అతడి మృతదేహం ఇంకా లభించలేదు. అడూర్‌మాలా ప్రాంతంలో కూడా కొండచరియలు విరిగిపడటంతో ఒకరు చిక్కుకుపోయారు.

అలాగే, కోచిధనుష్‌కోడి నేషనల్ హైవే, మాచిప్లావు వద్ద కూడా కొండచరియలు విరిగిపడిన కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇడుక్కి జిల్లాలోని ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఇంట్లో ఉన్న ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. కొట్టాయం జిల్లాలో శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయారు. కేరళలోని అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అనేక చోట్ల భారీగా ట్రాఫిక్ స్తంభించింది. 183వ జాతీయ రహదారిపై వందిపెరియార్ ప్రాంతంలో నీళ్లు నిలిచిపోయాయి. దీంతో రోడ్డు మార్గం మొత్తం బ్లాక్ అయింది. మరోవైపు నీటి మట్టం ఇంకా పెరిగిపోతోంది. పైగా చుట్టుపక్కల డ్యామ్‌ల నుంచి గేట్లు ఎత్తడంతో ఈ రోడ్డుపైకి ఇంకా నీరు చేరే అవకాశం ఉంది. ఎరాట్టుపేట, కంజిరాపల్లి, కూట్టిక్కల్, ఎరుమెలి వంటి అనేక పట్టణాలు కూడా నీట మునిగాయి.

పూంజార్ ప్రాంతంలో ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఇంట్లో ఇద్దరు చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. భారీ వర్షాలు, వరదల నుంచి ప్రజల్ని రక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేరళలోని వయనాడ్ సహా అనేక ప్రాంతాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. లోతట్టు



ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరిస్తున్నారు. అనేక ప్రాంతాలకు ఆరెంజ్, రెడ్ అలెర్ట్ జారీ చేశారు.

# 'నాకు 15 ఏళ్లే.. క్షమించండి మోదీజీ': బాలిక వీడియో వైరల్

"నాకు 15 ఏళ్లే.. మోదీజీ క్షమించండి" అంటూ ఒక బాలిక మాట్లాడిన వీడియో నెట్టింట్లో వైరల్ అవుతోంది . పేపర్‌లీక్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనల్లో భాగంగా ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు ఆ బాలికపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె తన తప్పు తెలుసుకుని క్షమాపణలు చెప్పినట్లు తెలుస్తోంది.

"నిరసనల్లో భాగంగా కొందరి ప్రభావానికి లోనైన నేను ప్రధానికి వ్యతిరేకంగా చెడు మాటలు మాట్లాడాను. నా వయసు 15 ఏళ్లు. నేను చేసిన పని క్షమించదగినది కాదు. ఇంతకు ముందెప్పుడూ ఇలా చేయలేదు. ఇక ముందూ చేయను. నా మాటలకు సిగ్గుపడుతున్నాను. యావత్ దేశానికి క్షమాపణలు చెప్తున్నాను. నన్ను క్షమించండి" అని బాలిక ఆ వీడియోలో మాట్లాడింది. ఆమెపై నోయిడా పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆమె వ్యాఖ్యలు ప్రధాని పదవిని అగౌరవపర్చేలా, శాంతియుత పరిస్థితులకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. అయితే ఆ ఫిర్యాదులో ఆమె వయసు 25 ఏళ్లు అని ప్రస్తావించగా.. వీడియోలో మాట్లాడిన బాలిక తన వయసును 15 ఏళ్లుగా వెల్లడించింది. జంతర్‌మంతర్‌లో నిరసన సందర్భంగా తనను తిట్టిన విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధాని మోదీ ఇన్‌స్టాలో కొన్ని గంటలముందు వీడియో పోస్టు చేసిన సంగతి తెలిసిందే. "యవ్వన దశలో ఇలాంటి తప్పిదాలు జరుగుతుంటాయి. పసితనం అంటే అదే. నేను వాళ్లను క్షమిస్తున్నా" అంటూ మోదీ తన పోస్టులో పేర్కొన్నారు. తన కుమార్తె మాట్లాడిన భాషపై ఆ అమ్మాయి తల్లి కూడా స్పందించారు. "పోలీసు అధికారులకు ఇప్పటికే క్షమాపణ లేఖ ఇచ్చాం. జరిగినదానికి మేం ఎంతగానో చింతిస్తున్నాం" అని మీడియాతో అన్నారు.



# పోటెత్తిన వరద.. 7 గంటలు చెట్టుపైనే!

**మహారాష్ట్ర ను భారీ వర్షా లు ముంచెత్తుతున్నాయి. జల్‌గావ్‌లో అంజనీ నదికి వరద పోటెత్తింది . దీంతో చేపల వేటకు వెళ్లిన సురేష్ భిల్ అనే వ్యక్తి నదిలో చిక్కుకుపోయాడు. ప్రాణాలు కాపాడుకునేందుకు నది మధ్యలో ఉన్న చెట్టు పైకి ఎక్కాడు. అతడిని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. వరద ఉద్ధృతి కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలగడంతో.. దాదాపు 7 గంటల తర్వాత ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అతడిని రక్షించారు. రాష్ట్రంలో మరో ఐదు రోజుల పాటు భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లను జారీ చేసింది. ముంబయి-పుణె మార్గంలోని కర్జత్-లోనావాలా ఘాట్ సెక్షన్‌లో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యాసంస్థలకు ప్రభుత్వం నేడు సెలవు ప్రకటించింది.**



# ఇక్కడ ఉమ్మివేసి.. విదేశాల్లో పరిశుభ్రంగా ఉంటారా..?

ముంబయిలోని డంపింగ్ యార్డ్‌ల వద్ద కాలుష్యం, విష వాయువులకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజలు బహిరంగంగా చెత్త పారవేయడం, రోడ్లపై ఉమ్మి వేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో ఇష్టానుసారం వ్యవహరిస్తూ.. విదేశాల్లో మాత్రం పరిశుభ్రంగా ఉంటారా..? అని విమర్శించింది. ఇక్కడ రోడ్లపై ప్రతిరోజూ చెత్త పడేసే వాళ్లు .. విదేశాల్లో చిన్న చాక్లెట్ కవర్ బయట పడేయాలన్నా ఆలోచిస్తారని వ్యాఖ్యానించింది.

వీధులు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారం లేకుండా చూసేందుకు పౌరులకు, మున్సిపల్ అధికారులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని.. అటువంటి వారికే పరిశుభ్రమైన వాతావరణాన్ని కోరుకునే హక్కు ఉంటుందని జస్టిస్ జి.ఎస్. కులకర్ణి, ఆర్తి సాఠేలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రోడ్లపై చెత్త, ఉమ్మి వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.

ప్రధాన రహదారులు, వీధుల్లో పడేసిన చెత్త వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని న్యాయస్థానం పేర్కొంది. అసలు మనం నాగరిక సమాజంలోనే జీవిస్తున్నామా అని ప్రశ్నించింది. హైకోర్టు భవనం సహా నగరంలోని వారసత్వ కట్టడాల సమీపంలో చెత్తను నిర్వహించే తీరుపైనా ఆందోళన వ్యక్తం చేసింది. మున్సిపల్ వాహనాల అస్తవ్యస్త నిర్వహణ వల్ల.. ఈ ప్రాంతాలను సందర్శించే విదేశీయులతో సహా అనేకమంది పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. దీనిపై వారం రోజుల్లోగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.






# అజిత్ దోవల్‌కు లోకమాన్య తిలక్ అవార్డు

జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ కు .. ఇవాళ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును అందజేశారు. పుణెలో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా అవార్డును అందజేశారు. లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్ మాట్లాడుతూ.. దేశ భద్రతకు, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్స్‌కు, బోర్డర్ సెక్యూర్టీకి పాల్పడుతున్న అజిత్ దోవల్‌కు అందజేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏకనాథ్ షిండే, డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డులో భాగంగా ఓ మెమొంటో, ప్రశంసా పత్రం, లక్ష క్యాష్ ప్రైజ్ ఇస్తారు. తమకు చెందిన రంగాల్లో దేశాన్ని అత్యున్నత స్థాయిలో నిలిపిన వారికి ప్రతి ఏడాది ఈ అవార్డును అందజేస్తారు. దేశ ప్రయోజనాల రక్షణ కోసం సేవ చేసిన అజిత్ దోవల్‌ను ఈ ఏడాది అవార్డు కోసం ఎంపిక చేశారు. ఇంటెలిజెన్స్, నేషనల్ సెక్యూర్టీ అంశంలో అజిత్ దోవల్ సుదీర్ఘ కెరీర్ ఉన్నది. ఆపరేషన్ బ్లాక్ థండర్, డోక్లామ్ దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల్లో అజిత్ దోవల్ పాత్ర కీలకమైంది. 1968 నాటి కేరళ కేడర్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ ఆయన. మూడు దశాబ్ధాల పాటు భారత ఇంటెలిజెన్స్‌లో పనిచేశారు. ఆ తర్వాత ఆయన ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా ఉన్నారు. మిజోరం, సిక్కిం, పంజాబ్, జమ్మూకశ్మీర్ లాంటి సున్నిత ప్రదేశాల్లో ఆయన పనిచేశారు. దీంతో పాటు ఇస్లామాబాద్, లండన్ పట్టణాల్లోనూ చేశారు. ప్రస్తుతం దోవల్ వయసు 81 ఏళ్లు. నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్‌గా సుదీర్ఘ కెరీర్‌లో కొనసాగుతున్నారు.

# వ్యాపారిపై హత్యాయత్నం.. భాగస్వామితో పాటు మరో ఆరుగురి అరెస్ట్



మహారాష్ట్రకు చెందిన పారిశ్రామికవేత్త, జీఎస్ఎమ్ ఫాయిల్స్‌కంపెనీ ఎండీ మోహన్‌సింగ్ పర్మార్ (46) పై కాల్పుల జరిగాయి. ఈ ఘటనలో గాయపడిన అతడిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడు సాగర్ గిరీష్ భానుశాలి (33), అతడికి సహకరించినవారిని అరెస్ట్ చేశారు. సాగర్ గిరీష్ భానుశాలి పర్మార్ కంపెనీలోని తోటి భాగస్వామి అని తెలిసి పోలీసులు ఖంగు తిన్నారు.

స్టాక్ మార్కెట్‌లో భారీగా నష్టపోయిన సాగర్ గిరీష్ పర్మార్ నుంచి రూ. 32 కోట్లు తీసుకున్నాడు. పర్మార్ అప్పు ఎగ్గొట్టేందుకు, కంపెనీని చేజిక్కించుకునేందుకు పర్మార్‌ను హత్య చేయాలనుకున్నాడు. దీంతో కంపెనీ ఉన్న వసాయ్ లోని నాయక్‌పాడ ప్రాంతంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు పర్మార్‌పై కాల్పులు జరిపారు. ఒక బుల్లెట్ భుజానికి తలిగింది. మరోసారి కాల్పులు జరిపే ప్రయత్నంలో పిస్టల్ జామ్ అయ్యింది. దీంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. సీసీటీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు సాగర్, అతడికి సహకరించిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

# కిశ్‌త్‌వాడ్‌లో క్లౌడ్‌బరస్ట్.. నిలిచిన రాకపోకలు



జమ్మూకశ్మీర్‌లోని కిశ్‌త్‌వాడ్‌లో శనివారం తెల్లవారుజామున మేఘ విస్ఫోటం సంభవించింది. ఆకస్మిక వరదలతో రోడ్లు బురదమయమయ్యాయి. భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడడంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కిశ్‌త్‌వాడ్, దోడా, రాంబన్ జిల్లాల్లో నదులు పొంగుతుండడంతో పలు వాహనాలు కొట్టుకుపోయాయి. ఈ మూడు జిల్లాలలోని పాఠశాలలను మూసివేసి.. ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నష్టపరిహారం అందిస్తామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రకటించారు.

వారం రోజుల పాటు పూంఛ్, కిశ్‌త్‌వాడ్, జమ్మూ, రాంబాన్, ఉధంపుర్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొండచరియల ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. కిశ్‌త్‌వార్, మచైల్ ప్రాంతాల్లో కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేసిందన్నారు.





# ఇంధన పంటలకు ఇదే తరుణం!

వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో అమ్మే అన్ని మోటారు వాహనాలూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ మాత్రమే కావాలి. ఒక దశాబ్దకాలంలో మనం దశలవారీగా డీజిల్, పెట్రోల్ వాహనాలను తొలగిస్తూ, వందశాతం ఈవీలకు మళ్లగలిగితే.. మనకు ఏడాదికి 25 కోట్ల టన్నుల భారీ స్థాయి ముడిచమురు అవసరం ఉండదు. బొగ్గు, చమురుపై ఆధారపడటం మానవాళి చరిత్రలో స్వల్పకాలిక దశ మాత్రమే. చివరికి మనకి బొగ్గు, చమురు, గ్యాస్ వనరులు ఖాళీ అవుతాయి. సౌరశక్తిని, జీవపదార్థాన్ని (బయోమాస్) ప్రత్యామ్నాయ ఇంధనంగా మార్చటం మీదే భవిష్యత్తు ఆధారపడి ఉంది. సౌర విద్యుదుత్పత్తి, స్టోరేజీ బ్యాటరీల ద్వారా ఇప్పుడు మనం ఆ ఇంధన స్వప్నానికి మునుపెన్నడూ లేనంత చేరువలోకి వచ్చాం. జీవ పదార్థాన్ని వినియోగ ఇంధనంగా సమర్థవంతంగా మార్చుకోవటానికి కొత్త సాంకేతికతలు ఇప్పుడు మనకో అవకాశాన్నిస్తున్నాయి.

మన వ్యవసాయ సాగుభూమి 170–180 మిలియన్ హెక్టార్లు. మొత్తం ప్రపంచ సాగునేలలో ఇది సుమారు 11శాతం. ఏడాది పొడవునా పంటలకు అనుకూలంగా ఉండేలా పుష్కలమైన సూర్యరశ్మి, ఉష్ణోగ్రతలు మనకున్నాయి. మన రుతుపవనాలు కావలసినంత వర్షపాతాన్ని అందిస్తాయి. మన భూములు సారవంతమైనవి. 1950లో భారత్ సుమారు 5.2 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను మాత్రమే ఉత్పత్తి చేసింది. దీనివల్ల మనం దిగుమతులపై భారీగా ఆధారపడ్డాం. అలాంటిది, ఇప్పుడు మనకు భారీ మిగులు ఉంది. 2024–25లో రికార్డు స్థాయిలో 35.8 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేశాం. దిగుబడుల సమయంలో, మన ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) 8 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు గోదాములలో నిల్వ చేస్తోంది. ప్రస్తుతం మన ధాన్యం గిడ్డంగులలో 6 కోట్ల మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి. ఆహారధాన్యాలను ఇలా మనం పెద్దఎత్తున ఉత్పత్తి చేస్తున్నా, వినియోగంలో సమాజం పోకడలు మాత్రం మారిపోయాయి. ప్రజల ఆహారపు అలవాట్లు మారటం, వైవిధ్యభరితం కావటంతో బియ్యం, గోధుమల తలసరి వినియోగం తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌లో వాటికి డిమాండ్ పరిమితమైంది. అయినా కూడా ఎప్పుడో కొరతల కాలంలో ప్రవేశపెట్టిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూపంలో మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి ప్రభుత్వం బలవంతంగా ధాన్యం కొనాల్సి వస్తోంది. వాటిని ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లోకి ఇబ్బడిముబ్బడిగా సరఫరా చేస్తోంది. పీడీఎస్‌కి సరఫరా చేసిన ఆహార ధాన్యాలలో సుమారు 40 శాతాన్ని లబ్ధిదారులు మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. రీసైక్లింగ్‌తో ఇవి చాలా సందర్భాలలో తిరిగి ఎఫ్‌సీఐకి చేరుతున్నాయి. మరోవంక, ఎంఎస్‌పీ పేరుతో అర్థరహిత ప్రోత్సాహకం ఇస్తుండటంతో రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు మళ్లటానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు.

ఇంధన పంటల పెంపకానికి సరైన రీతిలో రూపకల్పన చేసి అమల్లోకి తెస్తే, అన్ని సమస్యలనూ ఒక్కసారిగా పరిష్కరించగలదు. రైతులకు ఆదాయం పెరగటం, ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గించటం, గ్రామీణ పారిశ్రామికీకరణను ప్రోత్సహించటం, ఇంధన భద్రత కల్పించటం, చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించటం, పర్యావరణాన్ని పరిరక్షించటం.. ఇవన్నీ ఆ ఒక్క మార్పుతో సాధ్యమవుతాయి. ఉదాహరణకు, హైబ్రిడ్ సూపర్ నేపియర్ గ్రాస్‌ను నీటి వనరులున్న వరి సాగు భూముల్లో పండించటం. ఆ గడ్డి పెంపకానికి ఆ తరహా భూములు అనువైనవి. దీనివల్ల, రైతులు ఎకరాకు ఏడాదికి సుమారు 160 మెట్రిక్ టన్నుల తాజా గడ్డిని పండించగలరు. దీన్నుంచి 8 టన్నుల కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)ను ఉత్పత్తి చేయవచ్చు. ఇది ఎల్‌పీజీ(వంటగ్యాస్)కి ప్రత్యామ్నాయం. అంతేకాదు, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం (బయోచార్), జీవ ఇంధన ఎరువు వంటివి ఉత్పత్తి చేసి అమ్ముకోవచ్చు. ఈ రకంగా రైతులు ఎకరాకు రూ.80,000 నుంచి 1,00,000 నికర ఆదాయాన్ని ఆర్జించవచ్చు. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించనవసరం లేదు. రైతులకు గ్యారంటీగా, స్థిరంగా మంచి ధర లభించేలా భరోసాకు చర్యలు తీసుకుంటే చాలు (ఉదాహరణకు, తాజా నేపియర్ గడ్డి ఎం.టికి రూ.700–800, ఎండు రకానికి టన్నుకు రూ.3,000 వరకు). కాంట్రాక్ట్ వ్యవసాయ పద్ధతిలో ముడిసరుకు లభ్యతకు ఢోకా లేకుండా సీబీజీ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలి. ప్రభుత్వం ఇప్పటికే అటువంటి పరిశ్రమలకు పెట్టుబడి వ్యయ (క్యాపెక్స్) రాయితీలు, సీబీజీ కొనుగోలుకు హామీ ఇవ్వటం వంటి రూపాల్లో ప్రోత్సాహకాలను ఇస్తోంది. మనం చేయవలసిందల్లా ఈ ప్రక్రియను విస్తృత స్థాయికి విస్తరించటం. కాంట్రాక్ట్ వ్యవసాయం, ఉత్పత్తుల సేకరణకు విధివిధానాలను రూపొందించటం, ముడిసరుకును పరిశ్రమలకు అంతరాయం లేకుండా సరఫరా చేయటం, రైతులకు న్యాయమైన ధర వచ్చేట్లు భరోసా ఇవ్వటం. ఈపాటి ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చేస్తే, పదుల లక్షల ఎకరాల పల్లపు భూమిలో వరి లాంటి పంటలకు బదులు ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చు.

మనం భారత్‌లో 11.5 కోట్ల ఎకరాలలో వరి పండిస్తున్నాం. ఇందులో రెండు శాతం– సుమారు 25 లక్షల ఎకరాల భూమిని గనక నేపియర్ గ్రాస్ సాగుకు పూర్తిస్థాయిలో మళ్లించగలిగి, దాన్ని కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)గా మార్చగలిగితే సూర్యరశ్మి పుష్కలంగా ఉన్న మన భూముల్లో 2 కోట్ల టన్నుల సీబీజీని ఏటా ఉత్పత్తి చేయగలం. భారతదేశానికి వంటగ్యాస్ దిగుమతి అవసరం ఉండదు. ప్రస్తుత ధరల ప్రకారం– సుమారు రూ.1,50,000 కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకోగలం. భూమి ఉత్పాదకత పెరిగినకొద్దీ, మనం ఇంధన పంటల్ని ఎక్కువ ప్రాంతాలకు విస్తరించవచ్చు. ఆహార భద్రతకు ఢోకా లేకుండానే ఇవన్నీ చేయవచ్చు.

అదే విధంగా, భారత్‌లో 21 కోట్ల ఎకరాల అటవీ భూమి ఉంది. మన వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన ఇంధన చెట్లను అడవుల్లో పెంచవచ్చు. ఉదాహరణకు, పాప్లర్(కాటన్ వుడ్), విల్లో(కొండ గన్నేరు), యూకలిప్టస్ (నీలగిరి), సరుగుడు, గుమ్మడి టేకు(గహర్), మాంగియం (మక్కం), సుబాబుల్ తదితరాలు. ఒక ఎకరం అటవీ భూమిలో ఏటా ఎకరాకు 5 టన్నుల జీవ పదార్థాన్ని (బయోమాస్) సాధారణంగా ఉత్పత్తి చేయవచ్చు. జీవ పదార్థాన్ని ఇంధనంగా పూర్తిస్థాయిలో మార్చటానికి ఇప్పుడు సాంకేతికతలు(పైరోలిసిస్, ఎంజైమ్‌లు) అందుబాటులో ఉన్నాయి. అటవీ భూమిలో సుమారు 10శాతం గనక ఇంధన వృక్షాల పెంపకానికి కేటాయించగలిగితే బయోఇథనాల్, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం లేదా సుమారు 2.5 కోట్ల టన్నుల దిగుమతి నూనెకు సమానమైన విలువగల రసాయనాల్ని మనం ఉత్పత్తి చేయగలం.

మన భూ విస్తీర్ణం, సారవంత నేలలు, ఉష్ణమండల వాతావరణం, ప్రస్తుత సాంకేతికత, విస్తృత స్థాయి వల్ల సగటు వ్యయం తగ్గటం... ఇవన్నీ మనం హైడ్రోకార్బన్ల దిగుమతి మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా చేస్తున్నాయి. మన ఆర్థిక వ్యవస్థను విముక్తం చేసే అద్భుతావకాశాన్నిస్తున్నాయి. ఒక కీలక విధాన నిర్ణయం అమలు 'ఇన్ని రకాల లాభాలను సమాజానికి అందించటం' అరుదుగా మాత్రమే జరుగుతుంది. మనం ఈ అవకాశాన్ని తక్షణం అందిపుచ్చుకోవాలి.

# నేరస్థుల చేతిలో సాంకేతిక ఆయుధం

ఇప్పటికే అనేక ఆందోళనలకు కారణమవుతున్న కృత్రిమ మేధ(ఏఐ)పై ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులు ఏఐ ప్లాట్‌ఫామ్స్‌పై వ్యూహరచన చేస్తుండటం కలవరపాటుకు గురిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివి అనేక ఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో నేరగాళ్ల చేతిలో ఏఐ ఒక ఆయుధంగా మారకుండా ప్రభుత్వాలు, ఆయా సంస్థలు జాగ్రత్తపడాలి.నిరుడు జరిగిన ఓ ఘటనలో చాట్‌జీపీటీ ప్రమేయం ఆలస్యంగా వెలుగు చూసింది. అమెరికాలోని ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీ విద్యార్థి ఫీనిక్స్ ఇక్నర్ తాను సంచలనంగా మారాలంటే ఎంతమంది సహచర విద్యార్థులను చంపాలనేది తెలుసుకోవాలనుకున్నాడు. చాట్‌జీపీటీని అడగగా 'సాధారణంగా 3 లేదా అంతకంటే ఎక్కువ మంది చనిపోతే, మొత్తం బాధితుల సంఖ్య అయిదు నుంచి ఆరుగురి వరకు ఉంటే ఆ వార్త జాతీయ మీడియాలో వస్తుంది' అని సమాధానం చెప్పింది. అంతకుముందు అతను తాను ఎంత నిరాశాపూరితంగా, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలతో ఉన్నాడో ఆ చాట్‌బాట్‌కు వివరించాడు. ఆ తర్వాత ఇక్నర్ ఒక హ్యాండ్‌గన్, మందుగుండు సామగ్రి చిత్రాన్ని అప్‌లోడ్ చేసి దాన్ని ఎలా ఉపయోగించాలో చాట్‌బాట్‌ని అడిగాడు. ఆ తర్వాత ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీలో ఇద్దరిని చంపి, ఆరుగురిని గాయపరిచాడు. ఈ దారుణంలో చాట్‌జీపీటీ పాత్రపై తమ కార్యాలయం దర్యాప్తు ప్రారంభించిందని ఫ్లోరిడా అటార్నీ జనరల్ ఉత్మీయర్ పేర్కొన్నారు.



**పట్టించుకోని కంపెనీలు**

కెనడాలోని బ్రిటిష్ కొలంబియా టంబ్లర్ రిడ్జ్ పట్టణంలో మొన్న ఫిబ్రవరిలో ఘోరమైన కాల్పుల ఘటన చోటుచేసుకుంది. 18 ఏళ్ల జెస్సీ వాన్ రూట్‌సెలార్ అనే ట్రాన్స్‌జెండర్ తన ఇంట్లో తల్లిని, సవతి సోదరుడిని కాల్చి చంపింది. ఆ తర్వాత తాను గతంలో చదివిన టంబ్లర్ రిడ్జ్ స్కూల్‌కు వెళ్లింది. అక్కడ తను జరిపిన కాల్పుల్లో ఆరుగురు మృతిచెందగా మరో 27 మంది గాయపడ్డారు. తర్వాత తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దానికి కొన్ని నెలల ముందు జెస్సీ చాట్‌జీపీటీతో తుపాకీ హింస, సామూహిక కాల్పులు, హత్య దృశ్యాలు వంటి అంశాలపై సంభాషించింది. ఆ సంభాషణలను ఓపెన్ ఏఐ ఆటోమేటెడ్ రివ్యూ వ్యవస్థ ఫ్లాగ్ చేసింది. దాన్ని సమీక్షించిన కొందరు ఉద్యోగులు ఆమె కాల్పులు, హింసకు పాల్పడే అవకాశం ఉందని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కంపెనీ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. ఆమె ఖాతాను మాత్రం నిలిపివేసింది. జెస్సీ మరో ఈమెయిల్‌తో కొత్త ఖాతా తెరిచి చాట్‌జీపీటీని వినియోగించింది. హింసాత్మక విషయాలపై జరిగిన సంభాషణను గుర్తించాక కూడా అధికారులను అప్రమత్తం చేయటంలో ఓపెన్‌ఏఐ కంపెనీ విఫలమైందని పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి.

అమెరికాలోని చాలామంది పాఠశాల స్థాయి విద్యార్థులు హింసకు పాల్పడటంపై ఏఐ వేదికలను సంప్రదిస్తున్నారు. ఓ విద్యార్థి తన పాఠశాల, దాని మార్గాలతో పాటు తుపాకీతో ఉన్న తన ఫొటోలను అప్‌లోడ్ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులను కాల్చి చంపినట్లు చూపించాలని కోరితే చాట్‌జీపీటీ అలాగే చేయడం ఆందోళనకు గురిచేస్తోంది. ఉగ్రవాదులు, సైబర్ నేరగాళ్లు సైతం ఏఐని విస్తృతంగా వాడుతున్నారు. నిరుడు దిల్లీ ఎర్రకోట సమీపంలో వాహనంలో అమర్చిన పేలుడు పదార్థం ద్వారా చేసిన ఉగ్రదాడిలో ప్రధాన నిందితుడు జసీర్ బిలాల్‌వాని ఏఐ, సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వనరులను ఉపయోగించి రాకెట్ ఆధారిత ఐఈడీలు, పేలుడు పరికరాల తయారీకి సంబంధించిన సమాచారం సేకరించినట్లు ఎన్ఐఏ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఇక డీప్‌ఫేక్ వీడియోలు, వాయిస్ క్లోన్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం, భయపెట్టి డబ్బులు వసూలు చేయడం వంటి నేరాలైతే లెక్కలేనన్ని!

**తీసుకోవాల్సిన చర్యలివే...**

నేరస్థుల సామర్థ్యాన్ని పెంచే సాధనంగా ఏఐ మారడం ఆందోళన కలిగిస్తోంది. ఏఐ వ్యవస్థలు హానికర ప్రశ్నలను నిరోధించడానికి ప్రయత్నించినా వందశాతం చేస్తాయని చెప్పలేం. భద్రతాపరమైన అంశాల్లో ఏఐ సంస్థలు తగిన బాధ్యత తీసుకోవట్లేదనే విమర్శలున్నాయి. గోప్యత పాటించాల్సిన విషయాలు, సమాజానికి ప్రమాదకరమైన ఆలోచనలు, పోలీసులూ భద్రతా సంస్థలకు తెలియజేయాల్సిన అంశాలను ప్రభుత్వాలు స్పష్టంగా నిర్వచించాలి. ఏఐ విసురుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అందరూ సిద్ధం కావాలి. ప్రమాదస్థాయిని అంచనా వేసే వ్యవస్థలు ఏఐ కంపెనీలు, ప్రభుత్వం, భద్రతా సంస్థల్లో ఉండాలి. ఏఐతో సృష్టించే పత్రాలు, ఫొటోలు, వీడియోలపై విధిగా వాటర్ మార్క్ ఉండేలా చూడాలి. ఏఐ సంబంధిత నిఘా, నియంత్రణ, నేరాల విచారణకు ప్రత్యేక వ్యవస్థ, డీప్‌ఫేక్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి. అధునాతన సాంకేతికత దుర్వినియోగం కాకుండా చట్టాలను కఠినతరం చేయాలి. పౌర సమాజాన్ని చైతన్యం చేయాలి.

# నిరసన.. నైతిక బాధ్యత

సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణదీక్షలో ఉన్నారు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదికేజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక అవయవాలపై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరిస్తోంది. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమూ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమరణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించాల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామీ ఇస్తున్నారు. సోమవారం శీతాకాల సమావేశాలు మొదలవుతున్న పార్లమెంట్ వరకూ కాక్రోచ్ జనతాపార్టీ చేపట్టబోయే శాంతియుత ర్యాలీలో పాల్గొనేందుకు తాను కచ్చితంగా ఆ రోజువరకూ జీవించే ఉంటానని వాంగ్‌చుక్ విశ్వాసాన్ని ప్రకటించారు.



తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని, సోమవారం నాటి ర్యాలీలో పాలుపంచుకొని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఆయన పక్షాన నిలవడానికి మహామహులెవ్వరికీ ధైర్యం లేకపోయిందని సోషల్ మీడియాలో విమర్శలు ఉన్నప్పటికీ, దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు. నీట్ వైఫల్యం మీద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే ఇందిరాగాంధీ స్వయంగా లేహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిన ఘట్టాన్ని ఆ పార్టీనేతలు గుర్తుచేస్తున్నారు. 2011లో అన్నాహజారే దీక్ష సందర్భంలోనూ మన్మోహన్ సింగ్ మానవీయంగా వ్యవహరించారని, అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం, కలసికట్టుగా వ్యవహరించడం ఆ మహానుభావులకు తెలుసునని కాంగ్రెస్ వ్యాఖ్యానిస్తోంది. వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీమీద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ మీడియాలోనూ బురదజల్లే పని మరోపక్క జోరుగా సాగుతోంది.

లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదలచేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఇప్పటి ఆయన డిమాండ్లలో ప్రభుత్వానికి గిట్టనివీ, నెరవేర్చలేనివీ కొన్ని ఉండవచ్చు. కానీ, మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటానికీ, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విరమించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు. కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియుతంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది.

# ప్రజాసేవకు అర్థమే వేరులే!

'అడగనివాడు అవివేకి... ఏముంది, కాస్త సిగ్గు వదిలేసి లంచమడిగితే ఇల్లంతా బంగారమే. నీతి నిజాయతీలంటూ కూర్చుంటే విల్లాలూ ఎక్కడపడితే అక్కడ స్థలాలూ ఎలా సంపాదించుకోగలం? కాబట్టి జనం ఎంత ఛీత్కరించుకుంటున్నా మాకు డబ్బే సర్వస్వం' అనుకుంటూ అధికార యంత్రాంగంలో చాలామంది ఒక నిర్ణయానికి వచ్చేసినట్లున్నారు. అందువల్లే ధ్రువీకరణ పత్రాలు మొదలు ఇంటి అనుమతులు, భూ పట్టాలు, బదిలీలు, పదోన్నతులు, టెండర్లు, బిల్లుల మంజూరు... ఇలా అన్నిచోట్లా అవినీతి విశ్వరూపం దాలుస్తోంది. అందరికీ న్యాయం జరగాలన్న రాజ్యాంగ లక్ష్యాన్ని అది నీరుగార్చేస్తోంది. కడుపు నిండితే గారెలు చేదు అంటారు. కానీ, అవినీతి గ్రంథసాంగులకు మాత్రం ఎంత మేసినా ఆకలి తీరదు. సంతృప్తి ఉండదు. అందుకే, జాలీ దయా మంచీ మానవత్వం లాంటివేవీ లేకుండా కటిక పేదలను సైతం కాసుల కోసం కాల్చుకుతింటుంటారు. జాతి మూలుగను ఆబగా జుర్రేస్తుంటారు. ఇలాంటి మహానుభావుల్ని 'అవినీతి జలగలు, అనకొండలు, తిమింగిలాలు' అంటూ ఏదో శరీర ధర్మం కొద్దీ కడుపు నింపుకొనే ఆ జీవులతో పోల్చడం కచ్చితంగా వాటిని అవమానించడమే అవుతుంది!

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) చీఫ్ ఇంజినీర్ ఒకరి ఇంటితో పాటు పలు చోట్ల ఏసీబీ అధికారులు తాజాగా తనిఖీచేస్తే బహిరంగ మార్కెట్లో రూ.100 కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డాయి. ఆయన పేరిట ఉన్న లాకర్‌ను తెరిస్తే కిలోకు పైగా బంగారు ఆభరణాలు దొరికాయి. నాలుగు రెసిడెన్షియల్ ఫ్లాట్లు, అయిదు ప్లాట్లు, నాలుగెకరాల సాగుభూమి.. ఇలా ఆస్తుల చిట్టా పెద్దదే! సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓ ఇంజినీరు.. ఇతర అధికారులతో కుమ్మక్కయ్యి తన తండ్రిపేరుతో దొంగ ఏజెన్సీ సృష్టించి అభివృద్ధి పనుల పేరిట రెండేళ్లలో దాదాపు మూడు కోట్ల రూపాయలు బొక్కేశాడు. ఒక వ్యక్తి నుంచి నాలుగు లక్షల రూపాయల లంచం తీసుకుంటూ హైదరాబాద్‌లోని అబిడ్స్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. కాకినాడ కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్ ఇంట్లో సోదాలు చేస్తే రూ.ఎనిమిది కోట్ల విలువైన ఆస్తులు వెలుగు చూశాయి. ఏపీలోనే మొన్న ఫిబ్రవరిలో పంచాయతీరాజ్ విశ్రాంత ఎస్ఈ ఇల్లు, ఇతర ప్రదేశాల్లో తనిఖీలు జరిపితే కేజీల కొద్దీ బంగారం, వెండి, నోట్లకట్టలు బయటపడ్డాయి. లంచాలూ కమీషన్ల వసూలులో బరితెగించిన ఇద్దరు ఐఏఎస్ అధికారులను బిహార్ ప్రభుత్వం కిందటి నెలలో సస్పెండ్ చేసింది. జనాన్ని, ప్రజాధనాన్ని అడ్డగోలుగా లూఠీ చేస్తున్న ఇలాంటి ప్రబుద్ధ అధికారగణాల నుంచి సమాజాన్ని రక్షించేదెవరు?

అవినీతి మేతలో ఎంత ముదిరిపోయినా, స్వాహారాయుళ్ల కష్టాలూ వారికి ఉంటాయి అంటారా! నిజమే... ప్రజలను పీడించి పోగేసిన ఆస్తుల రక్షణకు నమ్మకమైన బినామీలను వెతకాలి. అక్రమ సంపాదన ఫలాలను దర్జాగా అనుభవించడంకోసం ఆ బినామీలు ప్లేటు ఫిరాయించకుండా చూసుకోవాలి. ఇదంతా ఎంత శ్రమ! తెలంగాణలో ఇటీవల ఏసీబీకి పట్టుబడిన పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ డీఎస్పీది ఇలాంటి వాటిలో అందెవేసినచేయి. బహిరంగ మార్కెట్లో ఏకంగా రూ.200 కోట్ల విలువైన అక్రమాస్తులు వెనకేసి ఇప్పటిదాకా ఏసీబీకి చిక్కిన పోలీసుల్లో అత్యంత అవినీతిపరుడిగా ఆయన ఖ్యాతికెక్కాడు. ఇటీవలే తెలంగాణలోనే పట్టుబడిన ఓ సర్వే, భూ రికార్డుల ఉపసంచాలకుడిది మరోచరిత్ర! ఆయన ఇంట్లో మూలనున్న కబోర్డ్‌లో చూస్తే అయిదు సంచుల్లో కోటిన్నర రూపాయలకు పైగా నోట్ల కట్టలు దర్శనమిచ్చాయి. తనిఖీల్లో ఒకే సమయంలో ఇంత మొత్తం దొరకడం ఇదే ప్రథమం. ఆ తరవాత ఆయనగారి సతీమణి పేరిట ఉన్న లాకర్లను పరిశీలిస్తే మరో కోటిన్నర రూపాయల నగదు, రెండు కేజీల బంగారం బయటపడింది. ఏదో అవసరానికి పనికొస్తాయని పాత దుస్తుల్ని మూటకట్టి అటకమీద పెట్టినట్టుగా, ఎక్కడపడితే అక్కడ డబ్బు దాచాడంటే ఆ అధికారి ఎంత విచ్చలవిడిగా చెలరేగిపోయి ఉంటాడు! ఇంతగా కట్టుతప్పుతున్న వ్యక్తులను వ్యవస్థలెందుకు ఏళ్లపాటు చూస్తూ ఊరుకుంటున్నాయి?

చాలామంది అధికారులకు ప్రజాసేవ అంటే వారు ప్రజలకు చేసేది కాదు. ప్రజలే వారిని సేవించుకోవాలి. ఉద్యోగం సంపాదించినందుకు జీతాలు తీసుకుంటున్నాం, పని చేయాలంటే చెయ్యి తడవాల్సిందే అని సర్వీసులో చేరిన మొదటి రోజు నుంచే భీష్మిస్తున్నవారు నానాటికీ పెరుగుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాదిలో మొదటి ఆరు నెలల్లోనే అలాంటి వారిపై తెలంగాణ ఏసీబీ 126 కేసులు నమోదు చేసింది. ఏపీ ఏసీబీ నిరుడు 115 అవినీతి కేసులు కట్టింది. ఇలా వార్తల్లోకి వస్తున్నవారిలో ఎందరికి శిక్షలు పడుతున్నాయని తలచుకుంటే ఆవేదనే మిగులుతుంది. తెలంగాణలో రెవెన్యూశాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మొత్తం 323 ఏసీబీ కేసుల్లో 2021 చివరి నాటికి ఒకటిన్నర శాతమే తెమిలాయి. ఏపీలో ఇలాంటివి కొలిక్కి రావడానికి పది నుంచి పన్నెండేళ్లు పడుతోందని ఉన్నతాధికార గణమే చెబుతోంది. తమపై నమోదైన కేసుల్లో న్యాయ విచారణకు అనుమతి రాకుండా కొందరు అధికారులు పైస్థాయిలో చక్రం తిప్పుతున్నారు. బెయిల్‌పై బైటికొచ్చాక దర్జాగా ఉద్యోగం చేస్తూ పదోన్నతులూ పొందుతున్నారు. నేతలూ అధికారగణాల మధ్య పెనవేసుకుపోయిన అనైతిక బంధం మూలంగానే పరిస్థితి ఇలా అఘోరిస్తోంది. అసలు, రాజకీయ అవినీతే అన్నిరకాల భ్రష్టాచారాలకు తల్లివేరు అవుతోంది. దానివల్లే నాసిరకం రోడ్లు, ప్రాజెక్టులు, వంతెనలు పుట్టుకొచ్చి దేశ ప్రగతి దీపం కొండెక్కిపోతోంది. అవినీతి విజృంభణ వల్ల దేశ జీడీపీకి ఏటా రెండు శాతం దాకా నష్టం వాటిల్లుతోంది. పాలన వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లి చట్టాలపై గౌరవం పోతోంది. ఈ దుస్థితి తప్పిపోయి పౌరసేవల్లో నాణ్యత పెరగాలంటే సుప్రీంకోర్టు సూచించినట్లు ప్రభుత్వ ఉద్యోగి అవినీతిని రాజ్యానికి, సమాజానికి వ్యతిరేకంగా చేసిన నేరంగా పరిగణించాలి. అలాంటి నేరగాళ్లకు వీలైనంత త్వరగా కఠిన శిక్షలు పడేలా చూడాలి. కానీ, నల్లధనమే ఇంధనంగా ధూర్త రాజకీయ రథాలను దౌడుతీయిస్తూ, అధికారులతో కలిసి నీకిది.. నాకిది అంటూ జాతివనరులను పంచుకుతినే నాయకులు ఉన్న పవిత్ర భారతంలో అవినీతి రాకాసిని నిజంగా భూస్థాపితం చేసేదెవరు?



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం | అనంతపురం | 02.08.2026 | 01

# ఛలో ఢిల్లీ పోస్టర్ విడుదల :సాకే నరేష్




**అనంతపురం :ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్**

బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్ విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ మాట్లాడుతూ ఆగస్టు 5, 6 తేదీలలో బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఢిల్లీ లోని కేంద్ర మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుంది. ప్రధాన డిమాండ్స్: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్స్ కల్పించాలి, బీసీ లకు చట్టసభల్లో రిజర్వేషన్స్ కల్పించాలి, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్స్ కల్పించాలి, కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ చేతివృత్తి కులాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, సామాజిక న్యాయం, ఉపాధి కేంద్రాలు, రైతులు, కార్మికుల సమస్యలు, న్యాయవాదిలకు రక్షణ చట్టం అమలు చేయాలని, విద్యారంగ సమస్యల పరిష్కరానికి కృషి తదితర సమస్యలపై ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుంది సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాది రంగనాయకులు, బీసీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి, జిల్లా కార్యదర్శి కె. నరేష్, గోపాల్, ప్రకాష్, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మూలాపేట డి ఎస్ ఆర్ హైస్కూల్‌లో

# నారాయణ ఉచిత వైద్య శిబిరం

- నారాయణ నేత్ర జ్యోతి, దంత సురక్ష శిబిరాలకు విశేష స్పందన
- మంత్రి నారాయణ సేవలు అభినందనీయం..డిప్యూటీ మేయర్ రూప్ కుమార్
- డిఎస్ఆర్ హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులకు కంటి, దంత పరీక్షలు
- విద్యార్థులకు త్వరలోనే ఉచితంగా కళ్లద్దాల పంపిణీ: అన్నంగి ప్రసాద్



**నెల్లూరు ఆగస్ట్ 01, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రజల శ్రేయస్సు, ముఖ్యంగా నిరుపేదల ఆరోగ్యం మరియు విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా అనేక బృహత్తర సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నారు.ప్రజా సేవే పరమావధిగా భావించే మంత్రి నారాయణ, సొంత నిధులతో నారాయణ నేత్ర జ్యోతి మరియు నారాయణ దంత సురక్ష పేరిట ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వేలాది మందికి కంటి చూపును, మెరుగైన దంత ఆరోగ్యాన్ని అందిస్తున్నారు.కేవలం వైద్య సేవలతోనే ఆగకుండా, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఆధునీకరించి, విద్యార్థుల సౌకర్యార్థం వేలాది ఉచిత సైకిళ్లను పంపిణీ చేసి విద్యా వికాసానికి ఎనలేని కృషి చేస్తున్నారు.ఈ క్రమంలోనే, నెల్లూరు నగరం మూలాపేట లోని 39వ డివిజన్‌లో ఉన్న డిఎస్ఆర్ హైస్కూల్‌లో శనివారం నారాయణ నేత్ర జ్యోతి,నారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని వైభవంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, 39వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ అన్నంగి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ మంత్రి నారాయణ సేవా కార్యక్రమాలను విశేషంగా కొనియాడారు...నారాయణ నేత్ర జ్యోతి ద్వారా ఇప్పటివరకు 12,000 మందికి కంటి పరీక్షలు పూర్తి చేసి, 7,000 మందికి ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేయడంతో పాటు 200 మందికి ఉచిత శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారని, అలాగే నారాయణ దంత సురక్ష ద్వారా 6,900 మందికి దంత పరీక్షలు నిర్వహించి, సంచార బస్సులోనే 1,000 మందికి పైగా అక్కడికక్కడే ఉచితంగా చికిత్స అందించి మిగతా వారిని ఆస్పత్రికి రిఫర్ చేశారని డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ వెల్లడించారు. నెల్లూరు నగరం మూలాపేటలోని 39వ డివిజన్ డి.ఎస్.ఆర్ హైస్కూల్‌లో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించి, తొలిరోజే 200 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు...ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి, ఇటీవల 7,000 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేసిన బాటలోనే, పేద విద్యార్థుల ఆరోగ్య భద్రత కోసం ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఎలాంటి స్వార్థం లేకుండా సొంత నిధులతో ప్రజా సేవ అందిస్తున్న మంత్రి నారాయణ కి ఆశీస్సులు తెలియజేస్తూ, హెడ్ మాస్టర్లు, తల్లిదండ్రులు, వైద్యులతో సమన్వయం చేస్తూ ఈ శిబిరాన్ని విజయవంతం చేస్తున్న క్లస్టర్ ఇన్‌ఛార్జ్ అన్నంగి ప్రసాద్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు...అనంతరం క్లస్టర్ ఇంచార్జ్ అన్నంగి ప్రసాద్ మాట్లాడారు డిఎస్సార్ పాఠశాలలో ఇప్పటివరకు సుమారు 200 మంది పేద విద్యార్థులు ఈ కంటి మరియు దంత పరీక్షల సేవలను వినియోగించుకున్నారని. ఈ పరీక్షల్లో కళ్ళద్దాలు అవసరమని తేలిన పిల్లలకి, ఎల్లుండి అదే పాఠశాలలో వైద్యుల ద్వారా ఉచితంగా కళ్ళద్దాలను పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఈ డివిజన్‌లో ప్రజల కోసం ఇప్పటివరకు 4 మెడికల్ క్యాంపులు నిర్వహించామన్నారు.. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ ప్రియ, డెంటల్ ప్రొఫెసర్ రాహుల్, AO ఆఫీసర్ సుధీర్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాలచర్లలో పింఛన్ల పంపిణీ

**రాప్తాడు ఆగస్టు 1 అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాప్తాడు శాసనసభ్యులు పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు మండల ఇంచార్జ్ ధర్మవరపు మురళి సూచన మేరకు రాప్తాడు మండలం పాలచర్ల గ్రామంలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యాలప్ప పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గ్రామ ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గవ్వల నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మోహన్ రెడ్డి, వడ్డే గోవిందు ,సచివాలయం సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఎర్రబస్సు వస్తుందా అన్నావ్..

# ఇప్పుడు విమానాలు వస్తున్నాయ్ చూడు

- భోగాపురంపై జగన్ వ్యాఖ్యల మీద ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం
- నగరంలో పింఛన్ల పంపిణీ, ఇంటింటికీ ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే
- అనంతపురంలో ఒక పెద్దమనిషి ఉనికి కోసం మెగా డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్నారు
- మేము చేసిన అభివృద్ధిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్న.. ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం ఆగస్ట్ 01 అనంత జనశక్తి న్యూస్**

భోగాపురంకి ఎర్రబస్సు అయినా వస్తుందా అన్న జగన్ రెడ్డి.. ఈరోజు భోగాపురం ఎయిర్ పోర్ట్ నేను తెచ్చానంటున్నాడని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మండిపడ్డారు. అసలైన క్రెడిట్ చోర్ జగన్ రెడ్డి మాత్రమేనని ఆయన కామెంట్ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీతో పాటు ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ టిడిపి అబ్జర్వర్ దేవేంద్రప్ప, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా 40వ డివిజన్ ఆజాద్ నగర్ లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. అనంతపురం నూతన సి.సి. రోడ్డు భూమిపూజ చేశారు. ఆ తర్వాత 7వ డివిజన్ వేణుగోపాల్ నగర్ లో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేకి మహిళలు మంగళహారుతులతో ఘన స్వాగతం పలికారు. భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దివ్యాంగులు, వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తూ.. రెండేళ్లలో చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్లలో మేము చేసిన అభివృద్ధి సగర్వంగా ప్రజలకు చెబుతున్నామని.. వైసీపీ నాయకులకు చెప్పుకునేకి ఏమీ లేక వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. అనంతపురంలో ఒక పెద్దమనిషి మెగా డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్నారని.. ప్రతి రోజు ఏదో నిరసన అంటూ బయలు దేరుతున్నారని విమర్శలు చేశారు. ఆయన్ని ప్రజలు మరిచిపోయారనే ఇలాంటివి చేస్తున్నారన్నారు. నగరంలో గత ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదన్నారు. రెండేళ్లలోనే 200కోట్లతో రోడ్లు, డ్రైన్లు ఇతర మౌళిక వసతులు కల్పించామని.. మేము చేసిన అభివృద్ధిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కేవలం 150రోజుల్లోనే మెగా డీఎస్సీని ఎలా వివాదాలకు తావు లేకుండా పూర్తి చేసి 16347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. గత ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకుండా ఉపాధ్యాయులు బాత్ రూమ్ లు, వైన్ షాపుల వద్ద కాపలాగా పెట్టారన్నారు. జగన్ రెడ్డి ఐదేళ్లలో అమరావతితో మూడుముక్కలాటలు ఆడారన్నారు. ఇప్పుడు అమరావతిలో వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని.. 2029కి ఒక అద్భుతమైన నగరంగా అమరావతి ఉంటుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం 70శాతం పూర్తి చేస్తే.. జగన్ రెడ్డి వచ్చాక దాన్ని గాలికి వదిలేశారన్నారు. గోదావరి పుష్కరాల్లోపు పోలవరాన్ని పూర్తి చేస్తారన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ ను అనతి కాలంలోనే నిర్మించి దేశంలోనే నెంబర్ 1 నిలిపారన్నారు.

మొదటి ఏడాది 60లక్షలు, రెండవ ఏడాది 4కోట్ల మంది ప్రయాణించే అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఇక్కడ ఎర్ర బస్సు కూడా రాదని చెప్పిన జగన్మోహన్ రెడ్డి.. ఇప్పుడు దీనిని నేనే తెచ్చానని జగన్ చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. సీఎం చంద్రబాబు ఏది చేసినా ప్రపంచానికే రోల్ మోడల్ గా ఉంటుందన్నారు. ఇంత అద్భుతమైని ఎయిర్ పోర్టును నిర్మించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజల తరుపున ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**రాప్తాడు ఆగస్టు 1 అనంత జనశక్తి న్యూస్**



మండలంలోని రాప్తాడు.2 . అంగన్వాడి కేంద్రం నందు గర్భవతులను, బాలింతలను పిల్లల తల్లులను సమావేశపరిచి "ప్రపంచ తల్లిపాల వారోత్సవాల" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి క్రింది విషయాలను చెప్పడం జరిగినది.బిడ్డ పుట్టిన వెంటనే "గంట "లోపల ముర్రుపాలు పట్టాలని, ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకాలని, తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారమని, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని, అలాగే ఏ ఇతర పాలు పట్టకూడదని తల్లి పాలు మాత్రమే తాగించాలని చెప్పడమైనది. తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి, బిడ్డకు ప్రేమానురాగాలు చక్కటి అనుబంధము ఏర్పడుతుందని, అలాగే బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు తోడ్పడతాయని, తల్లికి పాలు ఇవ్వడం వల్ల" బ్రెస్ట్ క్యాన్సర్" అనే జబ్బులు తల్లికి రాకుండా నివారించగలుగుతాయని , అలాగే బిడ్డకు బిడ్డకు ఎడమ ఉంటుందని అవగాహన కల్పించడమైనది. అలాగే 6 నెలలు పూర్తి అయిన తరువాత తల్లిపాలతో పాటు" అదనపు ఆహారము "అంగన్వాడీలో అందించే బాలామృతము, పాలు, గుడ్డు, ఇంటిలో కూడా ఆకుకూరలు ,కూర గాయలు ఉడికించి మెత్తగా గుజ్జు రూపకముగా పెట్టాలని చెప్పడమైనది. అలాగే బయట దొరికే జంక్ ఫుడ్, బిస్కెట్స్ ,చాక్లెట్స్ కేకులు, శీతల పానీయాలు ఇలాంటివి పెట్టకూడదని అవగాహన కల్పించడమైనది. అలాగే చిరుధాన్యాలతో తయారుచేసిన సెనగలు ,నువ్వులు ,వేరుసెనగ లడ్డూలు, చేసి పెట్టవలెనని అవగాహన కల్పించడం అయినది. ఈ తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలొ ఐసిడిఎస్ సూపర్వైజర్ లీలావతి, స్కూల్ టీచర్స్ అయినటువంటి నందిని , సరస్వతి , సంజీవమ్మ, అంగన్వాడీ టీచర్లు, విజయలక్ష్మి , లక్ష్మీదేవి, సావిత్రి ,భారతి ,ముత్యాలమ్మ, హెల్పర్ సుశీల, గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు, హాజరవ్వడం జరిగినది.

## ఇంటింటికీ

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**ధర్మవరం ఆగష్టు 1, అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం రూరల్ మండలం దర్శినమల గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ & వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ బాబు, బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు సాకే చంద్ర పాల్గొని లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన "సబ్కా సాథ్ – సబ్కా వికాస్" భావనకు అనుగుణంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా అందేలా ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ మార్గదర్శకత్వంలో నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధనుంజయ, హరి యాదవ్ తదితరులు పాల్గొని పెన్షన్ల పంపిణీలో భాగస్వాములయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి కొనసాగుతుందని నాయకులు తెలిపారు.

## బిజెపి కూడేరు మండల అధ్యక్షులుగా

# బోయ గోపాల్ నియామకం,



- శనివారం నాడు బిజెపి జిల్లా కార్యాలయం నందు ప్రకటించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

**కూడేరు ఆగస్టు 01, అనంత జనశక్తి న్యూస్**

శనివారం నాడు అనంతపురం జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కూడేరు మండల కమిటీ సమావేశనికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ హాజరయ్యారు ,కూడేరు మండల అధ్యక్షులుగా బోయ గోపాల్ ను నియమిస్తున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ ప్రకటించారు, ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన బిజెపి కూడేరు మండల అధ్యక్షులు బోయ గోపాల్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతను ఇచ్చిన బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, మండలంలోని సీనియర్ నాయకులకు మరియు తోటి నాయకులు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు, మండలంలోని ప్రతి బిజెపి కార్యకర్తను కలుపుకొని భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికై కేంద్రంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేత కృషికి నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు,

## యాడికి మండలంలో

# అర్హు లైన ఓటర్లు 40663



**యాడికి , ఆగష్టు 1,అనంత జనశక్తి న్యూస్ :**

యాడికి మండలంలో అర్హులైన ఓటర్లు 40663 ఉన్నారని తహాశీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహాశీల్దార్ శ్రీనివాసులు శనివారం తెలిపారు.ఈ సందర్భంగా తహాశీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహాశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు....యాడికి మండలంలో 20238 మంది పురుషులు ఉన్నారని, 20423 మంది స్త్రీలు ఉన్నారని, థర్డ్ జెండర్ 2 ఉన్నారని, మొత్తం 40663 ఓటర్లు ఉన్నారని తెలిపారు.అచూకీ తెలియని వారు 1346 మంది ఉన్నారని, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు 1240 మంది ఉన్నారని,మరణించిన ఓటర్లు 2085 ఉన్నారని,రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు 1328 మంది ఉన్నారని,ఇతరులు 3 ఉన్నారని, ఎన్నికల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో సేకరించడానికి వీలు కాని మొత్తం ఎన్యుమరేషన్ ఫారంలు 6002 ఉన్నాయని తెలిపారు.ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల, క్లైములు అభ్యంతరములు జూలై 31 నుండి ఆగష్టు 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చును అని తెలిపారు .ఓటర్లు ఎవరైనా ఓటరు జాబితా చూసోకవాలి అనుకున్న వారు ఆన్లైన్ నందు కానీ, కలెక్టర్ కార్యాలయం నందు గానీ, ఈ ఆర్ ఓ కార్యాలయంలో గాని, ఎ ఈ ఆర్ ఓ కార్యాలయంలో గాని, మీ సంబందిత బి ఎల్ ఓ దగ్గర పని వేళలో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటలకు వరకు చూసుకోవచ్చు అని తెలిపారు.

## విద్యా పర్యటనలో ఎస్కేయూ బొటానికల్ గార్డెన్ సందర్శించిన ఉద్యానవన కళాశాల విద్యార్థులు



**అనంతపురం, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

పీవీకేకే కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్‌కు చెందిన 42 మంది విద్యార్థులు శనివారం విద్యా పర్యటనలో భాగంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం, ఎస్కేయూ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు.విద్యార్థులు బొటానికల్ గార్డెన్‌లోని వివిధ మొక్కల జాతులు, నక్షత్ర వనం, గ్రీన్‌హౌస్‌లు, నర్సరీలను పరిశీలించి మొక్కల వైవిధ్యం, సంరక్షణ, పెంపకం, ఉద్యానవన నిర్వహణపై ప్రత్యక్ష అవగాహన పొందారు.ఎస్కేయూ బొటానికల్ గార్డెన్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. రవి ప్రసాద్ రావు గార్డెన్ చరిత్ర, అభివృద్ధి, వృక్ష వైవిధ్యంపై విద్యార్థులకు వివరించారు. అనంతరం గార్డెన్‌లోని అరుదైన, స్థానిక, అంతరించిపోతున్న వృక్ష జాతులు, ఔషధ మొక్కలను ప్రత్యక్షంగా పరిచయం చేస్తూ జీవవైవిధ్య పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు.ఈ విద్యా పర్యటనలో డా. నాగిరెడ్డి విద్యార్థుల బృందాన్ని సమన్వయం చేశారు.

## పీవీకేకేలో కృత్రిమ మేధ, సైబర్ భద్రత ప్రాజెక్టుల ప్రదర్శన ఘన ముగింపు



**- 55కు పైగా కృత్రిమ మేధ నమూనాల ఆవిష్కరణ.. విజేతలకు బహుమతులు**

**అనంతపురం, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

పీవీకేకే సాంకేతిక విద్యా సంస్థలో కార్పొరేట్ శిక్షణ విభాగం, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, ఉపాధి మార్గదర్శక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రెండు వారాల పాటు నిర్వహించిన కృత్రిమ మేధ, సైబర్ భద్రత ప్రాజెక్టుల ప్రదర్శన శనివారం ఘనంగా ముగిసింది.జూలై 20న ప్రారంభమైన ఈ శిక్షణలో విద్యార్థులకు కృత్రిమ మేధ, సైబర్ భద్రత, కృత్రిమ మేధ ఆధారిత సాధనాలు, స్వయంచాలక మేధ వ్యవస్థల రూపకల్పన, సూచనల రూపకల్పన వంటి అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన 55కు పైగా కృత్రిమ మేధ నమూనాలు ఆకట్టుకున్నాయి. కళాశాల నిర్వహణ, విద్యార్థుల అభ్యాసం, ఉపాధి అవకాశాలు, భద్రతకు ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను ప్రదర్శించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ కిషోర్ పల్లె మాట్లాడుతూ, విద్యార్థులు రూపొందించిన కృత్రిమ మేధ ప్రాజెక్టులు విద్యాసంస్థల అభివృద్ధికి, పరిశ్రమల అవసరాలకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు మాట్లాడుతూ, సిద్ధాంతపరమైన జ్ఞానంతో పాటు ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు, కార్పొరేట్, ఉపాధి శిక్షణ విభాగం ప్రతినిధులు, శిక్షకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదోన్నతిపై బదిలీ అవుతున్న ఎస్. మహబూబ్ బాషాకు ఘన సన్మానం



**అనంతపురం, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎస్. మహబూబ్ బాషాను జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహబూబ్ బాషా జిల్లాలో విధి నిర్వహణలో నిబద్ధతతో సేవలందించారని ప్రశంసించారు. పదోన్నతిపై చిత్తూరు జిల్లాకు వెళ్తున్న ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఉన్నత పదవిలోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం మహబూబ్ బాషాకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐ పవన్ కుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం తాత్కాలిక కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి
# అధిక ప్రాధాన్యత



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 01 అనంత జన శక్తి న్యూస్.**

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి రెండింటిని సమ దృష్టితో చూస్తుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఆమె శనివారం పుట్టపర్తి మండల పరిధిలోని కప్పలబండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి లబ్ధిదారులకు ఎంఎల్ఏ స్వయంగా పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర బడ్జెట్ లో రూ.10 వేల కోట్లకు పైగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసమే కేటాయించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గానికి లక్షల కోట్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగ అవకాశాలు లభించి యువతకు ఉపాధి కలుగుతుందని ఎమ్మెల్యే వివరించారు.ఇంటింటికి తెలుగుదేశం ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జన్మదినం సందర్భంగా కప్పలబండ గ్రామంలో అడుగడుగునా టీడీపీ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును కోసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి గ్రామస్తులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో ఎమ్మెల్యే గా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రజా ప్రతినిధులు రాష్ట్ర డైరెక్టర్లు వలిపి శ్రీనివాసులు,యశోద రాయుడు ,సహకార సొసైటీ అధ్యక్షులు విజయకుమార్ ,రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ పెద్దన్న ,చంద్రశేఖర్ ,శ్రీనివాసులు ,గోపాల్ ,నారాయణ స్వామి, నాగరాజు , మాధవి,రాధా, భాగ్య లావణ్య, మణి మాల,జ్యోతి, శ్యామల ఇతర మహిళా కార్యకర్తలు,టీడీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య వారంలోగా పరిష్కరిస్తాం

**- ఎమ్మెల్యే అమిలినేని**
**- గ్రామంలో మౌళిక వసతులు కల్పనకు కృషి చేస్తాం**
**- అట్టహాసంగా పండుగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**
**- కూటమి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ని ప్రజలకు ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని చేపట్టిన ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు**
**- రెండేళ్లలో నియోజకవర్గంలో 386.88 కోట్ల రూపాయలు పింఛన్ల రూపంలో అందించాం**
**- ప్రతి నెల 36,108 మందికి 16,05,41,000 రూపాయలు కూటమి ప్రభుత్వం ఇస్తోంది..**



**కళ్యాణదుర్గం ఆగస్టు 01 అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బంది ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్దులు, వితంతువులకు 4000 రూపాయలకు పెంచి నాటి నుంచి నేటి వరకు అందించడం జరుగుతోందని, రెండేళ్లలో ఒక్క కళ్యాణదుర్గం నియోజకవర్గానికే ప్రతి నెల 36,108 మంది లబ్ధిదారులకు 386.88 కోట్ల రూపాయలు అందించామంటే అది మా నాయకుడు మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఘనత అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు పేర్కొన్నారు..నేడు కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో ఎన్టీఆర్ సామాజిక భద్రత భరోసా పింఛన్లు పంపిణీ, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొనగ తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామస్థులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు..ముందుగా గ్రామంలోని భక్త కనకదాసు, ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబెద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి ఇబ్బందులు, ఇతర మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామానికి వచ్చే రహదారి సైతం దెబ్బతిందని గ్రామస్థులు చెప్పగా తప్పకుండా రాబోయే రోజుల్లో రోడ్డు నిర్మిస్తామని తెలిపారు..ప్రతి నెల మన నియోజకవర్గ వ్యాప్తంగా 36,108 మంది లబ్ధిదారులకు పింఛన్లు 16,05,41,000 రూపాయలు అందిస్తున్నామని, ఇప్పటి వరకు రెండేళ్లలో 386.88 కోట్ల రూపాయలు అందించామని పేర్కొన్నారు..మన ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారు దేశ, విదేశాలు తిరిగి మన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని, దాంతో పాటు సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలుస్తోందని, ఈ రెండు ఏళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లితుంటే ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారని, వర్షాలు లేక భూగర్భజలాలు తగ్గిపోవడం వలన తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు కృశి చేస్తామని భరోసా ఇచ్చారు..

# ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం తగదు
## 48 గంటల్లో క్లీన్ చేయకపోతే వేటు తప్పదు

**- కర్నాటకనాగేపల్లిలో జిల్లా కలెక్టర్**
**- ఆకస్మిక తనిఖీ**
**- చెత్త, మురుగునీటి నిల్వలపై తీవ్ర ఆగ్రహం – అధికారులకు 48 గంటల గడువు**
**- డెంగ్యూ రహిత పుట్టపర్తియే మన లక్ష్యం- ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి**
**- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**



**పుట్టపర్తి,ఆగస్టు,1:అనంత జనశక్తి న్యూస్**

డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవడం అత్యంత ఆవశ్యకమని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ప్రసాద్ స్పష్టం చేశారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కర్నాటకనాగేపల్లి ప్రాంతంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను, వీధుల్లో నిలిచివున్న మురుగునీటిని పరిశీలించిన ఆయన తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రజారోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 48 గంటల వ్యవధిలో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించాలని, నిలిచివున్న మురుగునీటిని ఖాళీ చేయాలని అధికారులను ఆదేశించారు.పారిశుధ్య నిర్వహణ పట్ల అధికారుల నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటేషన్ పనులను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని పుట్టపర్తి ఆర్డీఓ,స్పెషల్ ఆఫీసర్ పి. సువర్ణను ఆదేశించారు.పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు అదనపు సిబ్బందిని, యంత్రాలను వెంటనే రంగంలోకి దించి ఫాగింగ్ మరియు పిచికారీ పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును స్పష్టంగా ఆదేశించారు.

**ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి...**

"డెంగ్యూ రహిత పుట్టపర్తిని సాధించడమే మన అందరి ప్రాథమిక లక్ష్యం. నివాసాల ప్రాంగణాల్లో మరియు పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరూ శ్రమదానం చేయాలి. పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమైనది."

# ఘనంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలు



**- ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన పుట్టపర్తి నియోజవర్గ టీడీపీ కుటుంబ సభ్యులు**

**కొత్తచెరువు, ఆగస్టు 01,**

పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలు కొత్తచెరువులో తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తచెరువు నెహ్రూ సర్కిల్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంఎల్ఏ నిరంతరం కృషి చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని పలువురు నాయకులు ,కార్యకర్తలు కొనియాడారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, టీడీపీ ప్రజాప్రతినిధులు కాళహస్తి ఆలయ కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ ,వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, సాలక గారు శ్రీనివాసులు రామకృష్ణ మాణిక్యం బాబా నాగేంద్రప్రసాద్ హరిప్రసాద్ కూటమి పార్టీల నాయకులు తెలుగు యువత, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి మైలురాయి

**- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**
**- డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య**

**పుట్టపర్తి, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు.భోగాపురంలో రూ.4,727 కోట్ల వ్యయంతో 2,407 ఎకరాల్లో నిర్మిస్తున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విమానాశ్రయానికి అనుబంధంగా 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 130 ఎకరాల్లో ఎడ్యుసిటీ ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామిక, విద్యా రంగాలకు ప్రోత్సాహం లభించడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని తెలిపారు.విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని ఆమె కొనియాడారు.
రాష్ట్రంలో రూ.18 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం స్వర్ణాంధ్ర నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతోందని, రాయలసీమ అభివృద్ధికి కూడా కేంద్ర ప్రభుత్వం సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో చేసిన విమర్శలకు భిన్నంగా నేడు అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం సాకారమవడం ప్రజల ఆకాంక్షలకు నిదర్శనమని వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే, దేశానికి ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు
అమలవుతున్నాయని తెలిపారు.భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అభినందనలు తెలిపారు.

# సజావుగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం..

**- మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య.**

**ధర్మవరం ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణములోని 40వార్డులలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా నిర్వహించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పట్టణములోని పలుచోట్ల తాను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందని, పెన్షన్ దారులు చాలా సంతోషాన్ని వ్యక్తం చేసినారని తెలిపారు. మొత్తం పట్టణంలో 17,682 మందికి ఆగస్టు 1వ తేదీన 16,857 మందికి పెన్షన్ పంపిణీ చేయగా 96 శాతము నమోదు కావడం జరిగిందన్నారు. సర్వర్ పూర్తిగా అనుకూలించడం వలన త్వరితగతిన పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆగస్టు మూడవ తేదీ లోపల మిగిలిన పెన్షన్ దారులకు పంపిణీ చేస్తామని తెలిపారు.





# బిజీ పర్యటనలోనూ ప్రజా సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యం

**- యుద్ధప్రాతిపదికన నిడదవోలు బస్టాండ్‌లో నిలిచిన వరద నీటి తొలగింపు**

**- ప్రజా సమస్యలపై మంత్రి కందుల దుర్గేష్ తక్షణ స్పందనపై ప్రయాణికుల హర్షం**

**- గోదావరికి వరదల నేపద్యంలో ప్రజలు, రైతాంగం అప్రమత్తంగా ఉండాలని సూచన**

**నిడదవోలు ఆగస్టు 01 అనంత జనశక్తి న్యూస్**

ఎంతటి బిజీ షెడ్యూల్‌లో ఉన్నా ప్రజా సమస్యల పట్ల తక్షణమే స్పందించి పరిష్కరించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మరోసారి నిరూపించారు.

శనివారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బిజీగా ఉన్నప్పటికీ నిడదవోలు బస్టాండ్‌లో భారీ వర్షాల కారణంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తెలిసిన వెంటనే ఆయన త్వరితగతిన స్పందించారు. సమస్య తీవ్రతను గ్రహించిన మంత్రి దుర్గేష్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అత్యవసర ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి దుర్గేష్ స్పందనతో అధికారులు తక్షణమే రంగంలోకి దిగి, మోటార్ల సహాయంతో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపించి ప్రయాణికులకు ఉపశమనం కలిగించారు.

ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు స్పందించడం నా ప్రాథమిక బాధ్యత. నేను ఎక్కడ ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్యానించారు. గోదావరికి వరదల నేపద్యంలో ప్రజలు, రైతాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజా సమస్యలపై మంత్రి కందుల దుర్గేష్ చూపిన తక్షణ స్పందన మరియు సమర్థవంతమైన పనితీరు పట్ల నిడదవోలు నియోజకవర్గ ప్రజలు, ప్రయాణికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట



**నల్లచెరువు, ఆగస్టు 01 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు వీవర్స్ కాలనీలో ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విచ్చేసి వృద్ధులకు వికలాంగులకు పెన్షన్ డబ్బులు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేసారు,అనంతరం

మండల కేంద్రంలోని ఓరవాయి రోడ్డులో ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రహదారి దెబ్బతినడంతో వర్షపు నీరు నిల్వ ఉండి విజయలక్ష్మి కాలనీ, పంచాయతీ కాలనీతో పాటు పరిసర వీధుల్లోకి ప్రవహిస్తూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ జెడ్పీటీసీ అబ్దుల్ ఖాదర్ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి మరోసారి తీసుకెళ్లారు.ఈ సమస్యను గతంలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే రహదారి మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్ మరియు మండల సీనియర్ నాయకులు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లింగదీర్లపల్లి గ్రామంలో ఘనంగా ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమం.

**శెట్టూరు ఆగస్ట్ 1. అనంత జనశక్తి న్యూస్.**

శెట్టూరు మండలం లింగదీర్లపల్లి గ్రామంలో కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేనిసురేంద్రబాబు సూచనల తోఘనంగా ఇంటింటా కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ TR. తిప్పేస్వామి మాజీ జెడ్పిటిసి గురు ప్రసాద్ హాజరై ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి కరపత్రాలు పంపిణీ చేస్తూ సంక్షేమం గురించి తెలియజేస్తూ మరియు గ్రామంలో ఏమైనా సమస్యలా ఉన్నాయని గ్రామస్తులను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారువాటి నాయకులు కార్యకర్తలు



# బిజెపి రాష్ట్ర మైనార్టీ కార్యావర్గ సభ్యునిగా బార్ ఇంతియాజ్ నియామకం...

**నల్లచెరువు ఆగస్టు 1 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ మైనార్టీ నాయకుడు మండల నియోజకవర్గ జిల్లా స్థాయిలో వివిధ పదవుల్లో పని చేసి పార్టీని ముందుకు తీసుకువెళ్లడంతో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకుడు పివిఎన్ మాధవ్ మరియు రాష్ట్ర మైనార్టీ నాయకులు బార్ ఇంతియాజ్ ని గుర్తించి బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించారని తెలిపారు ఇంతియాజ్ మాట్లాడుతూ

పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకుంటూ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ బలోపేతం కోసం మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం అంకితభావంతో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు నాకు ఈ పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర బిజెపి నాయకులకు జిల్లా నాయకులకు నియోజకవర్గ నాయకులకు మండల నాయకులుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.



# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కారం



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 01 అనంత జన శక్తి న్యూస్.**

తల్లిపాలే తల్లి పాలు బిడ్డకు మొదటి టీకా అని పుట్టపర్తి సీడీపీఓ ఏ జయంతి అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ ఆదేశాల మేరకు కొత్తచెరువు మండలం పోతులకుంట పంచాయతీ పరిధిలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అయ్యగారి రజిత ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీఓ ఏ జయంతి హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, మొదటి ఆరు నెలలపాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు పౌష్టికాహారాన్ని ప్రారంభించి, రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదని పేర్కొన్నారు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలు , గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఐసీడీఎస్ సూపర్వైజర్ రజితతో పాటు పోతులకుంట అంగన్వాడీ కార్యకర్తలు సుబ్బలక్ష్మి, లీలావతి,మాధవి,శ్రావణి,సరోజ,గీత, లక్ష్మీదేవి ఆశ కార్యకర్త రమాదేవి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అమ్మ పాలు అమృతం

**- ఆగష్టు 01 నుండి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**

**అగళి ఆగష్టు 01,అనంత జనశక్తి న్యూస్ :**

అగళి మండలంలోని ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు మండలంలోని అన్ని అంగనవాడీ కేంద్రం పరిదిలోనూవారోత్సవాలు నిర్వహించు నున్నట్లు మడకశిర ఐసిడియస్ సూపర్వైజర్ లీలావతి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ముక్కడం పల్లి గ్రామములో అంగనవాడీ కేంద్రంలో మడకశిర ఐసిడియస్ సూపర్వైజర్ లీలావతి మాట్లాడుతూ శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, మొదటి ఆరు నెలలపాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడం తో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు పౌష్టికాహారాన్ని ప్రారంభించి,రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదని తల్లి పాలు యొక్క ప్రాముఖ్యత గురించి తెలియపరిచారు.ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు రాజశేఖర్, కోడిపల్లి పంచాయితీ అంగనవాడీ టీచర్లు, ఆశావర్కర్,గర్బవతులు,బాలింతలు తల్లులు హాజరైనారు.




# విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం..




**- గ్రామీణ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ: ఎమ్మెల్యే అమిలినేని**

**- ప్రమాదంలో గాయపడిన పార్టీ కార్యకర్తకు రూ.25 వేల ఆర్థిక సాయం**

**కంబదూరు, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థుల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రోత్సాహంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు.కంబదూరు మండలం ములకనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదో రోజు నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు యూనిఫాంలు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తూ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ఎన్నికల సమయంలో గ్రామాల్లో విద్యార్థులు బ్యాగులు మోసుకుని నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్తున్న దృశ్యాలు చూసి వారికి సైకిళ్లు అందించాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. ఎస్సార్సీ సంస్థ సహకారంతో రూ.5 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో 7,300 సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు.గత ప్రభుత్వం అమలు చేసిన "అమ్మఒడి" పథకంతో పోలిస్తే, ప్రస్తుతం "తల్లికి వందనం" పథకం కింద ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరేలా రూ.10,190 కోట్లు కేటాయించామని, అంగన్‌వాడీ సిబ్బందికీ ఈ పథకాన్ని వర్తింపజేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ విద్యా విధానంపై కూడా విమర్శలు చేశారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం రాష్ట్ర అభివృద్ధికి కీలక ఘట్టమని, కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. తిమ్మసముద్రం ప్రాంతంలో రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు కానుందని తెలిపారు. అనంతరం ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు దండా గోవిందప్పను పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ లో స్పాట్ అడ్మిషన్లు

**- ప్రిన్సిపల్ సురేష్ బాబు.**

**ధర్మవరం ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్:**




ప్రభుత్వ పాలిటెక్నిక్ ధర్మవరం నందు మిగిలిపోయిన సీట్లకు ఆగస్టు 5వ తేదీ నాడు మధ్యాహ్నం 3 గంటలకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. కావున ఆసక్తి గల విద్యార్థులు ఆగస్టు 3వ తేదీన కళాశాల నందు దరఖాస్తు చేసుకోవలెను. అడ్మిషన్లకు వచ్చే విద్యార్థులు ఇదివరకు ఏ పాలిటెక్నిక్ నందు అడ్మిషన్ అయి ఉండకూడదు. అడ్మిషన్ కు వచ్చే వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, అలాగే ఫీజు కట్టడానికై 6000 రూపాయలు తీసుకొని రావలసి ఉంటుంది. స్పాట్ అడ్మిషన్లు ద్వారా సీటు పొందే విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్ సౌకర్యము వర్తించదు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సురేష్ బాబు కోరారు.

# విద్యార్థినిల కోసం దాతలు ట్యాంకర్లు వితరణ.




**- బాలికల జూనియర్ కళాశాల లో త్రాగునీటి ట్యాంకులను అందజేసిన ధర్మవరం దాతలు.**

**- దాతలు సూర్యనారాయణ, నారాయణరెడ్డి.**

**ధర్మవరం ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో విద్యార్థిని లకు పరిశుభ్ర మైన త్రాగు నీటి కోసం నీటి ట్యాంకులను స్థానిక దాతలు సన్ ఫీస్ట్ బిస్కెట్ డీలర్ సూర్య నారాయణ మరియూ ఏ.నారాయణ రెడ్డి తదితరులు ప్రిన్సిపాల్ శ్రీ మతి ఎమ్. వనిత వాణి కి శనివారం ఈ దాతలు అందజేశారు. వీటిని పరిశుభ్ర మైన ప్రదేశం లో ఉపయోగించాలని దాతలు కోరారు. ఈ కార్యక్రమం లో కళాశాల అధ్యాపకులు సునీత ప్రభాకర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారుఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వనిత వాణి మాట్లాడుతూ..... రూ 40 వేలు విలువ కల ఈ త్రాగు నీటి ట్యాంకులు ఏర్పాటు చేసి వాటికీ కొళాయిలు వేస్తూ పైపు లైన్ వేసి నందుకు అందజేసిందుకు దాతలు సూర్య నారాయణ, ఏ. నారాయణ రెడ్డి కి ప్రిన్సిపాల్ వనిత వాణి కృతజ్ఞతలు తెలియజేశారు.

# మండలంలో 6,676 మందికి పెన్షన్ల పంపిణీ

**ధర్మవరం ఆగస్టు 1 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టినట్లు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వెంకటేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 6,676 మంది లబ్ధిదారులకు రూ.2.97 కోట్లకు పైగా పెన్షన్ నగదును పంపిణీ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అధికారులు, సిబ్బంది చేరుకుని పెన్షన్లను అందజేస్తున్నారని తెలిపారు.

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా పెన్షన్ల పంపిణీ జరుగుతోందని ఎంపీడీవో వెంకటేష్ పేర్కొన్నారు.

## ఘనంగా సామూహిక ఏడు శనివారాల వ్రతం.



**- -ఆలయ కమిటీ అధ్యక్షులు చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్.**

**ధర్మవరం ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని శ్రీనివాస నగర్లో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి గుడిలో 7 శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జింక రాజేంద్రప్రసాద్, సభ్యులు చెన్నం శెట్టి శ్రీనివాసులు, చెన్నం శెట్టి రమేష్, భక్తాదుల నడుమ ఘనంగా( మూడవ సారి) నిర్వహించుకున్నారు. ఆలయ అర్చకులు రాజేష్ స్వామి సామూహిక పూజలను సాంప్రదాయ పద్ధతి లో నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలతో తులసి ఆకులతో అలంకరించిన వైనం భక్తాదాలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది మహిళలు సామూహిక పూజలో పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా...!




**- తల్లిపాలు శ్రేష్టం... బిడ్డకు శక్తి, ఆరోగ్యం, పెరుగుదలకు మూలం.**
**- తల్లిపాలు అమృతం కన్నా గొప్పవి.**
**- పుట్టపర్తి సిడిపిఓ ఏ.జయంతి.**

**శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్:**

తల్లి పాలు బిడ్డకు మొదటి టీకా అని పుట్టపర్తి సీడీపీఓ ఏ. జయంతి అన్నారు శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ ఆదేశాల మేరకు కొత్తచెరువు మండలం పోతులకుంట పంచాయతీ పరిధిలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అయ్యగారి రజిత ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథిగా సీడీపీఓ ఏ జయంతి హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, మొదటి ఆరు నెలలపాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు పౌష్టికాహారాన్ని ప్రారంభించి, రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదని పేర్కొన్నారు మరియు తల్లిపాలు అమృతం కన్నా గొప్పవని, తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలు మరియు గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు కార్యక్రమం లో ఐసీడీఎస్ సూపర్వైజర్ రజితతో పాటు పోతులకుంట అంగన్వాడీ కార్యకర్తలు సుబ్బలక్ష్మి, లీలావతి,మాధవి,శ్రావణి,సరోజ,గీత, లక్ష్మీదేవి ఆశ కార్యకర్త రమాదేవి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అన్నదానం, అల్పాహారం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య సంఘం



**యాడికి, ఆగష్టు 1, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ దేవాలయం లో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు.శుక్రవారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మకి శాకాంబరీ దేవి అలంకారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం కూరగాయలు ఆకు కూరలతో అమ్మవారి ప్రసాదంగా దాదాపుగా 500 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే 3 గంటలకు గాంధీ విగ్రహం దగ్గర దాదాపుగా 1000 మందికి కిచిడి అల్పాహారం కార్యక్రమం ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించారు .ఈ కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం బంగారు బాల, లయన్ పవన్, విశ్వనాథ్ ,రాజేష్, మారుతి ,జయసింహ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్యే వినతులు స్వీకరణ

**పెద్దాపురం, ఆగస్టు 1: అనంత జనశక్తి న్యూస్**

పెద్దాపురం పట్టణంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని వారినుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని ప్రాధాన్యతగా తీసుకుని, వాటి త్వరిత పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, మొయిళ్ళ కృష్ణమూర్తి, నూనె రామారావు, బడుగు శ్రీకాంత్, సాల్మన్ రాజ్, దేవళ్ళ సతీష్, జలధాని సుబ్రహ్మణ్యం, బోస్, ఏసు బాబు, రేలంగి వెంకటరావు, బొందల రామలక్ష్మీ, కొల్లి సునీత, గుత్తుల సూర్యవతి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం




**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 01**
**అనంత జన శక్తి న్యూస్.**

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతను లక్ష్యంగా చేసుకుని అన్ని సబ్ డివిజన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలలో శక్తి టీం ఆధ్వర్యంలో శనివారం విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమాల్లో విద్యార్థులకు, మహిళలకు శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయాన్ని వేగంగా పొందేందుకు యాప్ ఉపయోగించే విధానాన్ని సులభంగా వివరించారు.
సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లోన్ యాప్‌లు, బ్యాంకింగ్ మోసాలు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేశారు.
ఈ సందర్భంగా పోక్సో చట్టం, బాల్య వివాహాల దుష్పరిణామాలు, మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు, వాటి నివారణకు అమలులో ఉన్న చట్టాలు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతపై శక్తి టీం సభ్యులు సమగ్రంగా అవగాహన కల్పించారు.
ప్రజల భద్రత దృష్ట్యా అత్యవసర సేవల కోసం ఉపయోగించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లను కూడా వివరించారు.

పోలీస్ అత్యవసర సేవలు - 100 / 112
మహిళల హెల్ప్‌లైన్ - 181
అగ్నిమాపక సేవలు - 101
సైబర్ మోసాల ఫిర్యాదుల కోసం - 1930
బాలల సహాయ నంబర్ - 1098

కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భద్రతా సూచనలను ఆసక్తిగా తెలుసుకున్నారు.
మహిళల రక్షణ, చిన్నారుల సంక్షేమం, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని శక్తి టీం సభ్యులు తెలిపారు.

## అగళి మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో తెదేపా నాయకులు

**అగళి ఆగష్టు 01,అనంత జనశక్తి న్యూస్ :**

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అగళి మండల వ్యాప్తంగా సజావుగా తెదేపా నాయకుల చేతుల మీదుగా అధికారులు ఆగష్టు నెల పెన్షన్లు పంపిణి చేసినారు. ఈ సందర్భంగా అగళిలో మండల జడ్పీటీసీ వీ.ఉమేష్, కోడిపల్లిలో సీనియర్ తెదేపా నాయకుడు కె.యన్. రమేష్, అగళిలో వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎం.ఆర్.శివరాములు, దోక్కలపల్లిలో మండల అధ్యక్షులు కుమారస్వామి, ఇనగలూరులో క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, మధూడి గొల్లహట్టిలో వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ శిల్ప కేంచప్ప, మధూడిలో తెదేపా అధ్యక్షుడు తిప్పేస్వామి, ఆయాయ పంచాయితీలలో తెదేపా నాయకులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి కార్యక్రమములో పాల్గొని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు డబ్బు కళాకారులకు తదితర పెన్షన్ లబ్ధిదారులకు శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి చేశారు.



# మాతా, శిశు మరణాలు జరగరాదు



**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**అనంతపురం, ఆగస్టు 01 :అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో ఏ ఒక్క మాతా, శిశు మరణాలు జరగరాదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఏప్రిల్ జూన్ 2026 లో జరిగిన మాతా, శిశు మరణాలపై త్రైమాసిక సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా బ్రహ్మసముద్రం మండలం మాముదూరు గ్రామానికి చెందిన డి.మమత (23), బుక్కరాయసముద్రం మండలం కేంద్రంలోని ఇస్లాం కాలనీకి చెందిన షేక్ హుస్సేన్ బి(27), పామిడి మండలంలోని ఎద్దులపల్లి పిహెచ్సి పరిధిలో కె. గాయత్రి(30), గూగుడు ఎస్సీ కాలనీకి చెందిన శివలక్ష్మిలకు సంబంధించి 4 మాతృ మరణాలపై కూలంకుశంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఏ తల్లి జన్మనిస్తూ చనిపోకూడదని, ఏ శిశువు జన్మిస్తూ మరణించకూడదన్నారు. మాతా, శిశు మరణాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బ్రహ్మసముద్రం మండలం మాముదూరు గ్రామానికి చెందిన డి.మమత మరణానికి సంబంధించి కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రిలో ప్రోటోకాల్ గైడ్లైన్స్ డ్రాఫ్ట్ చేసి అమలు చేయాలన్నారు. జిల్లాలో ఏ పిహెచ్సి పరిధిలో ఎక్కువ మరణాలు జరిగాయో చూసుకొని, అక్కడ మళ్ళీ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినెలా జరుగుతున్న ప్రసవాలపై కంట్రోల్ రూమ్ పెట్టి మానిటర్ చేయాలని ఆదేశించారు.

**వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్ష :**

అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది జులై వరకు ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా 9 11 నెలల మధ్య, 16 24 నెలల మధ్య ఉన్న పిల్లలకు తక్కువగా ఉందని, ఖచ్చితంగా ఇమ్యునైజేషన్ ను మరింత మెరుగుపరచాలన్నారు. జూన్ నెలకు సంబంధించి పీహెచ్సీలు, యూపీహెచ్సీల పనితీరులో కొన్నింటిపై నెగటివ్ ఫీడ్బ్యాక్ రావడం జరిగిందని, పాజిటివిటీని మరింత మెరుగుపరచాలన్నారు. ఉద్యోగుల అటెండెన్స్ పూర్తిస్థాయిలో నమోదయ్యేలా చూసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, డిఐఒ లక్ష్మీ ప్రసున, టిపీఎంఓ శ్రీనివాసరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి సన్నిధిలో డీఎస్పీ ప్రత్యేక పూజలు

**ధర్మవరం ఆగస్టు 1 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆషాఢ మాసం మూడో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం డీఎస్పీ బీవీ జగన్నాథ్ రాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ డీఎస్పీ కి పూర్ణకుంభ స్వాగతం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం డీఎస్పీ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక సేవల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరి పై ఉండాలని ప్రార్థించారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆషాఢ మాసం మూడో శనివారం కావడంతో ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులుగా జశ్వంత్ వ్యాస్ ఏకగ్రీవ ఎన్నిక

**అనంతపురం, ఆగస్టు 01 అనంత జనశక్తి న్యూస్**

మత్స్యకార సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా మత్స్యకార సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక కోర్టు రోడ్డులోని ఆరఎసఎస్ కార్యాలయంలో మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షులుగా జశ్వంత్ వ్యాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా ఉపాధ్యక్షులుగా బెస్త వెంకటేష్, బెస్త విజయ సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బెస్త పవన్ కుమార్, నగర అధ్యక్షులుగా బెస్త అశోక్ కుమార్, నగర ప్రధాన కార్యదర్శిగా బెస్త రాఘవేంద్రలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు, మత్స్యకార ప్రతినిధులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తానని, ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలు, సంక్షేమ పథకాలను సక్రమంగా అందేలా చూస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి అప్పగించినందుకు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంగముని, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోటా రాజేశ్వరి, జిల్లా గౌరవాధ్యక్షులు పిల్లి రవీంద్రలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మేక చంద్రబాబు, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎక్కలూరు నారాయణమూర్తి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన అధ్యక్షులు మనోజ్ కుమార్, మహిళా కమిటీ సభ్యులు మహేశ్వరి, మాజీ అధ్యక్షులు శివకుమార్, సభ్యులు పాపన్న, నాగేంద్ర, నవీన్, కిరణ్, వాసు, శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ప్రాధాన్య పనుల్లో క్వాలిటీ పెంచేలా కృషి చేస్తా

**- పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ నాగిరెడ్డి**
**- ఉద్యోగోన్నతిపై వచ్చిన ఈఈ నాగిరెడ్డికి స్వాగతం**

**అనంతపురం ఆగస్ట్ 01 అనంత జనశక్తి న్యూస్**



ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే గ్రామీణ ప్రాంత రహదారులు, భవనాల నిర్మాణాల్లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించేందుకు కృషి చేస్తానని పంచాయతీ రాజ్ అనుబంధం క్వాలిటీ కంట్రోల్ ఉమ్మడి అనంతపురం జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) ఈదుల నాగిరెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా పాణ్యం డీఈఈగా పని చేస్తూ ఈఈగా ఉద్యోగోన్నతిపై అనంతపురం క్వాలిటీ కంట్రోల్ ఈఈగా ప్రభుత్వం ఆయన్ను నియమించింది. దీంతో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కార్యాలయానికి చేరుకున్న ఆయనకు క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈఈలు ఆవుల లోకన్న, గోపాల్ నాయక్, ఓబులదాస్, ఏఈఈలు భాస్కర్, సంగీత మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పేస్వామి, ఇతర సిబ్బంది కూడా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఈఈ నాగిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ... 1992లో ఏపీపీఎస్సీ ద్వారా ఏఈఈగా ఉద్యోగంలో చేరిన తాను.. నంద్యాల, కర్నూలులో పీఆర్, ఆర్. డబ్ల్యూ.ఎస్ విభాగాలలో పని చేసినట్లు తెలిపారు. 2008 నుంచి రాజీవ్ స్వగృహ, ఎస్.ఎస్.ఏ, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో డీఈఈగా సేవలందించినట్లు పేర్కొన్నారు. తాజాగా ఇటీవల నిర్వహించిన ఉద్యోగోన్నతుల ప్రక్రియలో ఈఈగా ఉద్యోగోన్నతి పొంది ఉమ్మడి అనంతపురం జిల్లా క్వాలిటీ కంట్రోల్ విభాగానికి వచ్చినట్లు వివరించారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్ట కృషి అవసరం



**పెద్దాపురం, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

బాల్య వివాహాల నివారణకు సంబంధిత శాఖల అధికారుల సమిష్టి కృషి అవసరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఎం గంగ సూర్యనారాయణ, పెద్దాపురం ఆర్డీవో కృష్ణమూర్తి లు అన్నారు. జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) పి కృష్ణమూర్తి అధ్యక్షతన పెద్దాపురం ఆర్డివో కార్యాలయంలో బాల్య వివాహ నిరోధక అధికారులకు డివిజనల్ స్థాయి అవగాహన, సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఎం గంగ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం అత్యంత అవసరమని, ముఖ్యంగా బాల్య వివాహాల నిర్మూలనలో రెవెన్యూ, పోలీసు, విద్య, ఐసీడీఎస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రతి బాల్య వివాహ సమాచారాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి తక్షణ చర్యలు చేపట్టి, ప్రతి బాలుడి, బాలిక హక్కులను పరిరక్షించాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ ప్రతి శాఖ యొక్క ఉమ్మడి బాధ్యత అన్నారు. గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులు, విద్యార్థులు, యువత మరియు ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే రెవెన్యూ, పోలీసు, విద్య, ఐసీడీఎస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో స్పందించి వాటిని అడ్డుకోవాలని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ జి.ఓ. ఎంఎస్. నెం. 39, జి.ఓ. ఎంఎస్. నెం. 31 నిబంధనల ప్రకారం అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేసినప్పుడే గ్రామ, మండల స్థాయిలో బాల్య వివాహాలను సమర్థవంతంగా నిరోధించగలమన్నారు.

బాల్య వివాహాల నివారణలో ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో పెద్దాపురం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసిల్దార్లు, విద్యాశాఖ అధికారులు, సీడీపీవోలు, ఎస్హెచ్‌వోలు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

# మధ్యవర్తిత్వంతో వివాదాలకు శాశ్వత పరిష్కారం




**సత్తెనపల్లిలో వారం రోజుల అవగాహన కార్యక్రమం ప్రారంభం**

**సత్తెనపల్లి, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మధ్యవర్తిత్వం దేశం కోసం" వారం రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి తాలూకా కేంద్రంలో మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయకుమార్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలకు మధ్యవర్తిత్వ విధానం ప్రాముఖ్యతపై కరపత్రాలు పంపిణీ చేశారు.ప్యానెల్ న్యాయవాదులు పాటిబండ్ల రవి, గుజ్జర్లపూడి సురేష్ మాట్లాడుతూ సివిల్ తగాదాలు, బ్యాంకు, రాజీపడదగిన క్రిమినల్, మనోవర్తి, చెక్ బౌన్స్, రెవెన్యూ, కోర్టుకు ముందున్న వివాదాలు తదితర కేసులను మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.పారా లీగల్ వాలంటీర్లు అట్లూరి జ్యోతి, గోపయ్య ప్రజలకు ఉచిత న్యాయ సేవలు, మధ్యవర్తిత్వ విధానం, న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.**

# సోలార్ ప్రాజెక్టులపై గత హామీలను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నిలబెట్టుకోవాలి



**- బీఎస్పీ**

**అనంతపురం, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

రాయదుర్గం నియోజకవర్గంలో సోలార్, గాలి విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుపై గతంలో చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వ్యవహరించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందనూరు నాగరాజు కోరారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో సోలార్ ప్రాజెక్టులను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానే ఏర్పాటు చేయాలని, లేదా ప్రైవేటు సంస్థల ద్వారా అమలు చేస్తే రైతులకు రావాల్సిన 30 ఏళ్ల లీజు, భూముల భద్రతపై ప్రభుత్వం హామీ ఇవ్వాలని కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారని గుర్తు చేశారు.ప్రైవేటు సంస్థలు భారీ రుణాలతో ప్రాజెక్టులు చేపడితే భవిష్యత్తులో ఆర్థిక సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో రైతులు లీజు ఆదాయం కోల్పోవడంతో పాటు భూములపై కూడా అనిశ్చితి నెలకొనే ప్రమాదం ఉందని అప్పట్లో కాలవ శ్రీనివాసులు చెప్పారని పేర్కొన్నారు.ప్రస్తుతం అధికార పక్ష ఎమ్మెల్యేగా ఉన్న కాలవ శ్రీనివాసులు అదే అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించి, రైతుల ప్రయోజనాలను కాపాడాలని బీఎస్పీ డిమాండ్ చేసింది.ప్రాజెక్టులను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ఏర్పాటు చేయాలని లేదా ప్రైవేటు సంస్థల ద్వారా అమలు చేస్తే రైతుల లీజు చెల్లింపులు, భూముల భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరింది. రైతులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి కాలవ శ్రీనివాసులు వ్యవహరిస్తారా లేదా అన్నది ప్రజలు గమనిస్తున్నారని చిందనూరు నాగరాజు పేర్కొన్నారు.

# రైతులకు పంటల బీమా ప్రీమియం పొడిగింపు

**- అగ్రికల్చర్ ఏవో వెంకటరమణాచారి**

**అమడగూరు :1 అనంత జనశక్తి న్యూస్**

ఆమడగూరు మండలం అగ్రికల్చర్ ఏవో వెంకటరమణ ఆచారి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంటల భీమా 15 8 2026 తేదీ వరకు పంటల బీమా అవకాశాన్ని రైతులు అవకాశం కల్పించారు సాధారణంగా రైతు పెట్టిన పంటకు సకాలంలో గిట్టుబాటు ధర రాకపోక రైతు చాలా ఇబ్బంది పడుతున్నాడు అతివృష్టి కి అనావృష్టి కి పంటలతో చాలా నష్టపోతున్నారు పి ఎం ఎఫ్ వి వై బీమా కోసం ఒక ఎకరంకు కట్టవలసిన ప్రీమియం కంది పంటకు 102 రూపాయలు, మొక్కజొన్నకు 165 రూపాయలు, రాగి పంటకు 100 రూపాయలు, ఆముదము పంటకు వంద రూపాయలు, వరి పంటకు 200 రూపాయలు ఈ ప్రీమియం చెల్లించవలసిన ప్రదేశాలు నమోదు చేసుకుని స్థలంలోనే మీ సేవ కేంద్రం లేదా సిఎస్సి సెంటర్లో చేసుకోవచ్చు లేదా బ్యాంకు రుణాలు తీసుకున్న బ్యాంకులో లేదా ఆన్లైన్లో పిఎం ఎఫ్ బి వై ప్రీమియం నమోదు చేసుకోవచ్చు అని ఏవో వెంకటరమణ ఆచారి తెలియజేయడం జరిగింది





# నేడు టిడిపి మండల స్థాయి సమావేశం

**నల్లచెరువు ఆగస్టు 01 అనంత జనశక్తి న్యూస్**

కదిరి నియోజకవర్గం శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు కూటమి పార్టీ మండల స్థాయి సమావేశం శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయం నందు నిర్వహించబడునని ఈ సమావేశంలో శ్రీ పాలపాటి దిన్నే ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ మరియు డోర్ 2 డోర్ కార్యక్రమం మీద చర్చ జరుగునని కన్వీనర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు యూనిట్ ఇన్‌చార్జీలు బూత్ ఇన్‌చార్జీలు, మాజీ వైస్ చైర్మన్లు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వార్డు ఇన్‌చార్జీలు,మహిళా నాయకులు సభ్యులు,గ్రామ పార్టీ అధ్యక్షులు,మండల కమిటి నాయకులు అన్ని అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# ప్రతి బూత్ పై ప్రత్యేక దృష్టి



**- విజయమే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ...**
**- బత్తలపల్లిలో బిఎల్ఏ-2లు...**
**- బూత్ ఏజెంట్లతో**

**సమన్వయ సమావేశం...**

**ధర్మవరం / బత్తలపల్లి ఆగష్టు 1**

**అనంత జనశక్తి న్యూస్ :**

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల బీజేపీ కార్యాలయంలో బిఎల్ ఏ2లు, బూత్ ఏజెంట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. బూత్ నిర్వహణ, ఓటరు నమోదు, సంస్థాగత విస్తరణ, కార్యకర్తల బాధ్యతలు, ఎన్నికల కార్యాచరణపై నాయకులు సమగ్రంగా చర్చించి పలు సూచనలు చేశారు.

సమావేశానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు కోటి సుధ, బత్తలపల్లి మండల ఇన్‌చార్జి అంబటి సతీష్, మండల అధ్యక్షుడు ఆకులేటి భాస్కర్, జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు సురేంద్ర నాయుడు, మండల ఓబీసీ అధ్యక్షుడు గుర్రప్ప పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి బూత్‌ను పార్టీ కి బలమైన కేంద్రంగా తీర్చిదిద్దాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరును నమోదు చేయించడంతో పాటు బూత్ కమిటీలను మరింత చురుకుగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కార్యకర్తల సమన్వయం, ప్రజలతో నిరంతర సంబంధాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కావేటి మల్లికార్జున, ముసుగు రామచంద్ర, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకటేష్ చౌదరి, వడ్డే తిరుపతయ్య, పాల్యం తేజ, వెంకటేష్, వెంకటరమణ, యువమోర్చా నాయకులు కప్పల సుదర్శన్, గవ్వల ప్రవీణ్, భూషణ్, కోళ్ల కుమార్, బొంతల ఉజ్జినప్ప, అదెప్ప రవీంద్ర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

"ప్రతి బూత్‌లో బలమైన నిర్మాణం - ప్రతి కార్యకర్తలో సేవాభావం - అదే విజయానికి మార్గం" అనే నినాదంతో సమావేశం ముగిసింది.

# మరిడమ్మ అమ్మవారి 38 రోజుల ఆదాయం రూ. 23.46 లక్షలు



**పెద్దాపురం, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

పెద్దాపురం ఇలవేల్పు అయిన శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయానికి గత 38 రోజుల హుండీల ఆదాయం రూ. 23,46,290 వచ్చింది. దేవాదాయ తనిఖీదారు వీ ఫణీంద్ర కుమార్, కాకినాడ నూకల మాలయ అధికారి ఎం వీరభద్రరావు, ఆలయ ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష ల పర్యవేక్షణలో శనివారం గత 38 రోజుల హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ఆలయ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు, భక్తమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొని సేవలు అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపు కార్యక్రమంలో హుండీల ద్వారా రూ. 23,00,938, అన్నదానానికి రూ. 46,352, వెరసి రూ. 23,46,290 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారిణి విజయలక్ష్మి తెలిపారు.

# శృంగార వల్లభ్యుని దర్శనానికి భారీగా భక్తులు



**- రూ. 2.12 లక్షలు ఆదాయం**

**పెద్దాపురం, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

పెద్దాపురం మండలం తొలి తిరుపతి క్షేత్రంలో శృంగార వల్లభ స్వామి దర్శనాలకు శనివారం భక్తులు పోటెత్తారు. ఈవో వడ్డీ శ్రీనివాసరావు, చైర్మన్ మొయిళ్ళ సంధ్యా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణ ఆచార్యులు, రవి ఆచార్యులు శ్రీ భూ సమేత శ్రీ శృంగార వల్లభ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దూర ప్రాంతాలనుంచి సైతం వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనాలకు వచ్చిన భక్తుల ద్వారా శనివారం ఒక్కరోజే రికార్డ్స్ స్థాయిలో రెండు లక్షల 12 వేల 161 రూపాయల ఆదాయం లభించినట్లు ఈవో వడ్డీ శ్రీనివాసరావు తెలిపారు. స్వామి దర్శనాలకు వచ్చిన భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదాన్ని, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డిఎస్పీ బాలగంగాధర్ తిలక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించగా ఆయన శనివారం ఆలయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, అధికారులు పాలకవర్గానికి తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. శతాబ్దాల చారిత్రిక ప్రాధాన్యత కలిగిన తొలి తిరుపతిలో శృంగార వల్లభ స్వామి దర్శనం సర్వ శుభకరమని అర్చకులు నారాయణచార్యులు తెలిపారు. దూర ప్రాంతాల నుండి స్వామి దర్శనాలకు వస్తున్న భక్తులకు షడ్రుచుల భోజన ప్రసాదాన్ని అందించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వికసిత భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి



**- ఎస్కేయూ విద్యార్థులకు సమగ్ర మానవీయ విలువలపై అవగాహన**

**అనంతపురం, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

సమగ్ర మానవీయ మరియు వికసిత భారత కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్కేయూ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సమాజం పట్ల బాధ్యత, నైతిక విలువలను అలవర్చుకుని విద్య ద్వారా సమాజాభివృద్ధిలో తమ పాత్రను గుర్తించాలని సూచించారు.సమగ్ర అభివృద్ధి, నవ్య ఆలోచనలు, నైపుణ్యాల పెంపుదల ద్వారా వికసిత భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జి. సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్.ఆర్. సుధా శివరెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రామ్ అధికారి జి. అర్చన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భర్త అప్పులు తాళలేక గృహిణి ఆత్మహత్య.

**ధర్మవరం ఆగస్టు 1, అనంత జనశక్తి న్యూస్:**



పట్టణములోని కె. భాగ్యలక్ష్మి, (వయస్సు 35) అను మహిళ, భర్త అప్పులు తాళలేక ఇంట్లోనే ఉరి వేసుకున్నదని టూటౌన్ సిఐ జయ నాయక్ తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.... పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన రాఘవేంద్రను సుమారు 14 సంవత్సరాల క్రితం వివాహం చేసుకొని, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో జీవనం సాగిస్తోంది అని తెలిపారు.. ఆమె భర్త రాఘవేంద్ర వ్యాపారంలో నష్టాలు, అప్పులతో మద్యం కు బానిసై, మృతురాలిని తరచూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. భర్త పెట్టిన వేధింపులు, చేసిన అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన మృతురాలు ఇంటి లో ఇనుప మెట్లకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించగా, చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. మృతురాలి తల్లి కొప్పల చోడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త రాఘవేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ..




**- తల్లిపాల వారోత్సవాల నిర్వహణ**

**అమడగూరు, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అమడగూరు మండలం కొత్తపల్లి బొబ్బిలికోట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ కార్యకర్త పి. అరుణ మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. పుట్టిన వెంటనే శిశువుకు ముర్రిపాలు ఇవ్వడంతో పాటు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు.తల్లిపాలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని, తల్లులు కూడా తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్



**భోగాపురం, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ శనివారం భోగాపురంలో జరిగిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా విమానాశ్రయాన్ని ప్రారంభించారు.అనంతరం జరిగిన బహిరంగ సభలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్ మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, మురళీధర్ మొహోల్, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## తక్కువ ధరకు బియ్యం విక్రయ కేంద్రం సోమవారం ప్రారంభం..

**- తహసిల్దార్ నరసింహులు.**

**గాండ్లపెంట , ఆగస్ట్,**
**అనంత జనశక్తి న్యూస్,**



జిల్లా సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గాండ్లపెంట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో అక్రమ్ షాపు వద్ద తక్కువ ధరకు బియ్యం విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండల తహసీల్దార్ నరసింహులు శనివారం తెలిపారు. ఈ విక్రయ కేంద్రాన్ని ఆగస్టు 3వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరలో అందించాలనే ఉద్దేశంతో ఈ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తక్కువ ధర కే నాణ్యమైన బియ్యం

**- ఆగస్టు 3 నుంచి విక్రయ కేంద్రం...**

**ధర్మవరం ఆగష్టు 1 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరలో అందించేందుకు ధర్మవరంలో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని ఆగస్టు 3 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్డీవో ఓ. రాంభూపాల్ రెడ్డి తెలిపారు. దుర్గమ్మ గుడి సమీపంలోని మున్సిపల్ గాంధీ పార్క్ కాంప్లెక్స్‌లో ఈ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఆధార్ కార్డుదారునికి 5 కిలోల బియ్యం అందజేయనున్నట్లు తెలిపారు. స్టీమ్ రైస్‌ను కిలో రూ.52, రా రైస్ ను కిలో రూ.50 చొప్పున విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ధర్మవరం డివిజన్ పరిధిలోని సంబంధిత అధికారులు కేంద్రం ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసుకోవాలని ఆర్డీవో సూచించారు.









# ఉత్తరాంధ్ర... ఇకపై ఉత్తమ ఆంధ్ర










**మొదటిపేజీ తరువాయి**

విజయనగరం జిల్లా భోగాపురంలో శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులే ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారమని, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరును విమానాశ్రయానికి పెట్టడం గర్వకారణమన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన జీఎంఆర్ సంస్థ నిర్మించిన ఈ విమానాశ్రయం ప్రాంత సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతోందన్నారు. ఈ ప్రాజెక్టుకు పునాది వేసిన మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు, ప్రస్తుతం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇద్దరూ ఉత్తరాంధ్ర వారేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సముద్రం, కొండల నడుమ నిర్మితమైన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందుతుందని చెప్పారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మిస్తున్నామని, శంషాబాద్ విమానాశ్రయం తెలంగాణ రూపురేఖలు మార్చినట్లే భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర దశ, దిశను మార్చబోతోందని ముఖ్యమంత్రి అన్నారు.

**ఉత్తరాంధ్రకే వలస వచ్చే రోజులొచ్చాయి**

ప్రధాని మోదీ సహకారంతో... కేంద్రం అందిస్తున్న తోడ్పాటుతో గత రెండేళ్లలో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించామని, వాటి ద్వారా 5.57 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు సెంటిమెంట్ నిలబెట్టింది ప్రధాని నరేంద్ర మోదీనేనని చెప్పారు. అలాగే విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రత్యేక ఆర్థిక వెసులుబాటు కలిగించి...స్టీల్ ప్లాంట్ పునర్ వైభవం సాధించేలా ప్రధాని సహకరిస్తున్నారని సీఎం తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాని సహకరించారన్నారు. మూడేళ్లల్లో రూ.2,784 కోట్లతో 8 సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి అనుమతులు వచ్చాయని... దానికి నిధులు కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 14న గోదావరి నీటిని అనకాపల్లికి తీసుకువస్తామని, వంశధార-గోదావరి అనుసంధానం కూడా చేపడతామని వెల్లడించారు. పర్యాటకం, ఫార్మా, రేర్ ఎర్త్ ఖనిజాలు, జాతీయ రహదారులు, ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉత్తరాంధ్ర కేంద్రంగా మారుతుందని చెప్పారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి మారి, భవిష్యత్తులో ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే రోజులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ప్రధాని చేతుల మీదుగానే పోలవరం... అమరావతి

విశాఖ ఉక్కు పరిరక్షణ, విశాఖ రైల్వే జోన్, పోలవరం, అమరావతికి కేంద్ర సహకారం అందించిన ప్రధాని మోదీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. 2027 నాటికి పోలవరం పూర్తిచేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, అలాగే 2028 నాటికి అమరావతి తొలి దశను పూర్తి చేసి ప్రధానితో ప్రారంభింపచేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని చెప్పారు. ఒకప్పుడు "ఎర్రబస్సే రాదు" అని వెక్కిరించిన చోట నేడు ప్రపంచస్థాయి ఎయిర్‌బస్ దిగుతోందని, అభివృద్ధిని అడ్డుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారని వ్యాఖ్యానించారు.

**మోదీ విధానం 'నేషన్ ఫస్ట్'**

ప్రపంచం ఐటీ నుంచి ఏఐ వైపు అడుగులు వేస్తున్న సమయంలో దేశానికి ప్రధాని మోదీ లాంటి సమర్థ నాయకుడు అవసరం ఉందని సీఎం అన్నారు. డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి కార్యక్రమాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను నాలుగో స్థానానికి తీసుకొచ్చారని కొనియాడారు. ప్రపంచ దేశాల ముందు భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన నాయకుడు మోదీనేనని అన్నారు. ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతన్న యుద్ధాల వల్ల భారత దేశంపై ఆ ప్రభావం పడకుండా చూడడంలో ప్రధాని మోదీ సక్సెస్ అయ్యారని గుర్తు చేశారు. వివిధ దేశాల ప్రజలు సరైన నాయకత్వం కోసం.. సరైన నాయకుడు కోసం ఎదురు చూస్తున్న తరుణంలో... భారత దేశానికి మోదీ రూపంలో అద్భుతమైన నాయకత్వం లభించిందని... ఇది దేశ ప్రజల అదృష్టమన్నారు. క్లిష్ట కాలంలో కూడా 144 కోట్ల భారత ప్రజల ఆశలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాని మోదీ ఒక్కరి వల్లే సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. మోదీని విమర్శించే వారికి కూడా ఆయన చేసిన మంచి... దేశానికి చేసిన సేవలు తెలుసని చెప్పారు. ప్రధాని మోదీకి దేశ ప్రజలందరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తన ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో నరేంద్ర మోదీ వంటి నాయకుణ్ని చూడలేదని, "రైట్ టైమ్... రైట్ ప్లేస్... రైట్ మ్యాన్" మోదీయేనని వ్యాఖ్యానించారు.

**ఎయిర్ పోర్ట్ టెర్మినల్లో కళాకృతులను ఆసక్తిగా తిలకించిన ప్రధాని**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రారంభించిన అనంతరం చెక్‌ఇన్ హాల్, ఆధునిక ప్రయాణికుల సదుపాయాలు, సాంకేతిక వ్యవస్థలను పరిశీలించారు. విమానాశ్రయ మాస్టర్ ప్లాన్, ఏవియేషన్ హబ్, ఏవియేషన్ ఎడ్యుసిటీ నమూనాలను జీఎంఆర్ ప్రతినిధులు వివరించారు. టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన భారీ వీడియో వాల్‌లో ప్రదర్శించిన ఉత్తరాంధ్ర చరిత్ర, ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రికి వివరించారు. విమానాశ్రయ ప్రాంగణంలోని తెలుగు కళా సంపదను ప్రతిబింబించే కళాఖండాలను ప్రధాని ఆసక్తిగా తిలకించారు. టెర్మినల్ నుంచి ఓ పెన్‌టాప్ జీపులో సభా వేదికకు చేరుకునే మార్గం మధ్యలో గిరిజన మహిళలు.. విద్యార్థినులు చేసిన థింసా నృత్యంతో ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగత పలికారు. సభా ప్రాంగణానికి చేరుకున్న ప్రధానమంత్రికి ప్రజలు జాతీయ జెండాలు ఊపుతూ కరతాళధ్వనులతో స్వాగతం పలికారు. సభా వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొందూరు ఖాదీ శాలువాతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఘనంగా సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కలిసి ఉత్తరాంధ్ర కళా వైభవానికి ప్రతీక అయిన బొబ్బిలి వీణను ప్రధానమంత్రికి జ్ఞాపికగా అందజేశారు. ఓ పెన్ టాప్ జీపులో ప్రధాని మోదీ వెంట ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉన్నారు. వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**చంద్రబాబు కృషితోనే ఏపీకి పెట్టుబడుల వెల్లువ: ప్రధాని ప్రశంసలు**

రాత్రింబవళ్లు కష్టపడి పరిశ్రమలను ఆకర్షించేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి ఫలితంగానే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని ప్రధాని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజిన్ సర్కార్‌లో కీలక భాగస్వాములుగా ఉన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పెట్టుబడులు-ఉపాధి-అభివృద్ధి అనే లక్ష్యంతోనే ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు. పెట్టుబడులు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుందని, ఉత్పత్తి పెరిగితే ఎగుమతులు పెరుగుతాయని, ఎగుమతులు పెరిగితే ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, చివరికి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అదే అభివృద్ధి నమూనాను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని ప్రధాని మోదీ ప్రశంసించారు.






**విశాఖపట్నం ఆగస్ట్ 01 అనంత జనశక్తి న్యూస్**

## ఎర్రబస్సు రాదన్న చోటకు ఎయిర్ బస్సు వచ్చింది

కొందరు ఎర్రబస్సు రాని ఊరికి విమానాశ్రయం అవసరమా అని అన్నారు. ఉత్తరాంధ్రను తక్కువగా అంచనా వేసి ఇక్కడి ప్రజలను అవమానించిన వాళ్లకి ఈరోజు దిమ్మ తిరిగే సమాధానమే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం. ఎర్రబస్సు రాదు అన్న చోటకి ఎయిర్ పోర్ట్ వచ్చింది. ఎర్రబస్సు రాదు అన్నచోటకి ఎయిర్ బస్ వచ్చింది. ఎర్రబస్సు రాదు అన్న చోటకి ఏకంగా మన నమో వచ్చారు. ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ... అర్థమైందా రాజా..' అంటూ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉత్తేజభరితంగా ప్రసంగించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో ప్రధాని నరేంద్ర మోదీజీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు.

**ఉత్తరాంధ్ర కలలకు రెక్కలిచ్చిన నమో**

ఎయిర్ పోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహావీరుడు అల్లూరి సీతా రామరాజు నడయాడిన గొప్ప నేల ఉత్తరాంధ్ర. ఈ రోజు నుంచి ఈ నేల చరిత్ర, పౌరుషం గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది.

ఈ రోజు కేవలం ఒక ఎయిర్ పోర్ట్ ప్రారంభం మాత్రమే కాదు. మన నమో వికసిత్ భారత్, మన సీబీఎన్ విజన్ కలిసిన రోజు. ఉత్తరాంధ్ర భవిష్యత్తు మారే రోజు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకెళ్లే రోజు. ఈనేలపై స్వాతంత్ర్యం కోసం పోరాడింది అల్లూరి సీతారామ రాజు అయితే ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు ఇచ్చింది మన నమో. రైతుల త్యాగం, కార్మిక కష్టం, మన సీబీఎన్ విజన్‌కు ప్రతిరూపం ఈ విమానాశ్రయం. అల్లూరి సీతా రామరాజు కి ఉన్న పట్టుదల, పౌరుషం, దేశ భక్తి నాకు మన నమోలో కనిపిస్తుంది. నమో అంటే ధైర్యం, నమో అంటే విశ్వాసం, నమో అంటే సురక్షిత భారత్. నమో అంటే శత్రువు గుండెల్లో భయం, అభివృద్ధి, పేదల సంక్షేమం, భవిష్యత్తుకు భరోసా కోరుకునే వారికి ఒకే ఒక సమాధానం నమో.

# పెన్షన్ పండుగ... ఇంటింటికీ మంత్రి నారాయణ

- దీనదయాళ్ నగర్‌లో లబ్ధిదారులకు స్వయంగా నగదు పంపిణీ
- ఆగస్టు నెల పెన్షన్లతో అవ్వాతాతల్లో ఆనందం.
- రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగిన మంత్రి.
- దీనదయాళ్ నగర్ లో రెండు నెలల్లో ఎండ్ టూ ఎండ్ రోడ్లు పూర్తి చేయాలని ఆదేశించిన మంత్రి



నెల్లూరు, ఆగస్టు 1:అనంత జనశక్తి న్యూస్

నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ దీనదయాళ్ నగర్‌లో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్ నగదును అందజేశారు.అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి వారికి సక్రమంగా అందుతున్నదా అని ఆరా తీశారు.రెండేళ్ల నమ్మకం ,అభివృద్ధి సంక్షేమాన్ని వివరిస్తూ ముందుకు సాగారు. దీనదయాళ్ నగర్ లో రెండు నెలల్లో ఎండ్ టూ ఎండ్ రోడ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అడగకుండానే అన్నీ చేస్తున్న మంత్రికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి స్వయంగా ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ అందజేయడం,యోగక్షేమాలు తెలుసుకోవటంతో వృద్ధులు వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి పెన్షన్, 'తల్లికి వందనం', ఉచిత గ్యాస్ సిలిండర్లు, నారాయణ సైకిళ్లు వంటి పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొంటూ ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీ అంటే ప్రజలకు గుర్తొచ్చేది ఎన్టీఆర్ భరోసా పెన్షన్లేనని అన్నారు.భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో పాల్గొని పెన్షన్ ల పంపిణీ కోసం నెల్లూరు రావటం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్‌ను ఒకేసారి రూ.4 వేలకు పెంచి అమలు చేశారని చెప్పారు. గత ప్రభుత్వం వాయిదాల పద్ధతిలో పెన్షన్ పెంచగా, కూటమి ప్రభుత్వం మాట తప్పకుండా ఒకేసారి పెంపు అమలు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెలలో 62.07 లక్షల మందికి రూ.2,712.84 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పెన్షన్ల కోసం రూ.71,312 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. రాష్ట్ర జనాభాలో 12.88 శాతం మందికి ఏటా రూ.33 వేల కోట్ల వ్యయంతో పెన్షన్లు అందిస్తున్న ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు, పూర్తి వికలాంగులకు రూ.15 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల పెన్షన్లు అందిస్తున్నామని వివరించారు. నెల్లూరు జిల్లాలో ఈ నెల 2,86,106 మందికి రూ.126.36 కోట్ల పెన్షన్లు మంజూరు కాగా, నగర పాలక సంస్థ పరిధిలో 45,041 మందికి రూ.19.88 కోట్ల పంపిణీ జరుగుతోందన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 20,305 మందికి రూ.8.91 కోట్ల పెన్షన్లు అందజేస్తుండగా, ఒక్క 4వ డివిజన్‌లోనే 1,228 మందికి రూ.54.19 లక్షల పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.గత పాలకులు అన్నా క్యాంటీన్లు,ఏసీ బస్ స్టాప్ లు మూసేశారని,రాష్ట్రాన్ని 10 లక్షలకోట్ల అప్పుల్లో ముంచి వెళ్లారని ఆరోపించారు.సీఎం అపార అనుభవంతో పరిస్థితులు గాడిలో పడుతున్నారు.16 వేల మందికి మెగా డీఎస్సీతో ఉద్యోగాలు ఇచ్చారని, దానిపైనా అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయబోతున్నామని తెలిపారు.కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, మహిళా నేతలు విజేతా రెడ్డి, పొత్తూరు శైలజ, డివిజన్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి జోరుగా 'డోర్ టు డోర్' ప్రచారం



- కూటమి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విపరీతమైన ఆదరణ!
- అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పాలన.
- గొట్లూరులో ఇంటింటా టిడిపి ప్రచారం

ధర్మవరం రూరల్ ఆగస్ట్ 1, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు శనివారం ధర్మవరం మండలం, క్లస్టర్-6 పరిధిలోని గొట్లూరు గ్రామంలోడోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నేత గొట్లూరు శ్రీనివాసులు,గొట్లూరు గ్రామం టిడిపి నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు గ్రామంలోని ప్రతీ ఇంటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు పూసగుచ్చినట్లు వివరించారు.

ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి మాట్లాడుతూ... గత జగన్ ప్రభుత్వ పాలనకు, నేటి కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు స్పష్టంగా గమనించాలని కోరారు. ఒకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తూనే, మరోవైపు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని కొనియాడారు. గొట్లూరు గ్రామంలో ఎలాంటి రాజకీయ తారతమ్యాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ పాలన పూర్తిగా దుర్వినియోగమైందని, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి పంచాయతీకి సకాలంలో నిధులు జమ చేస్తూ గ్రామాలను 'స్మార్ట్ గ్రామాలు'గా తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ ప్రతి గ్రామానికి ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక వశీకరణ సమర్పించండి ప్రభుత్వం పూర్తి కట్టుబాటులో ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుల మేకల రామాంజనేయులు, విజయ్ సారధి, ఏలుకుంట్ల రమణ, మల్లేనిపల్లి చంద్ర, రాంపురం శీన, పార్థ రెడ్డి, భాస్కర్ చౌదరి, విజయ్ చౌదరి, అమర సుధాకర్, రమేష్ నాయుడు, అదేప్ప, బడన్నపల్లి రామాంజనేయులు, విశ్వనాథ,గడ్డం సంజీవ రాయుడు, అమర రవి,లతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

# బెంగాల్ సీఎం సువేందుపై హనీట్రాప్‌కు ఉగ్రకుట్ర

- జైషే మహ్మద్ నెట్‌వర్క్‌కు..
- సహకరించిన మహిళ అరెస్ట్
- భగ్నం చేసిన బెంగాల్ పోలీసులు
- సహకరించిన ఝార్ఖండ్ మహిళ అరెస్ట్

అనంతపురం, ఆగస్ట్ 1, అనంత జనశక్తి న్యూస్:



పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని హనీ ట్రాప్ ద్వారా సమాచారాన్ని సేకరించేందుకు ఉగ్రవాద ముఠా కుట్ర పన్నినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జైషే మహ్మద్‌తో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్న హమీమ్ మండల్ కేసులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. హమీమ్ మండల్‌కు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అర్పితా సర్కార్ అనే మహిళను పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ జార్ఖండ్‌లోని సాహెబ్‌గంజ్‌లో అరెస్ట్ చేసింది.

పోలీసులు ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. ఇటీవల బర్ధమాన్‌లో అరెస్టైన హమీమ్ మండల్.. పాకిస్థాన్‌కు చెందిన హ్యాండ్లర్ల సూచనల మేరకు పనిచేస్తున్న నెట్‌వర్క్‌లో భాగంగా ఉన్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడు బీజేపీ నేతలు సహా పలువురు వీఐపీల కదలికలపై నిఘా పెట్టడం, కొత్త వ్యక్తులను నెట్‌వర్క్‌లో చేర్చడం, భవిష్యత్తులో ఉగ్ర కార్యకలాపాలకు అవసరమైన సమాచారాన్ని సేకరించడం వంటి పనుల్లో పాల్గొన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

ఈ కేసు దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం.. అర్పితా సర్కార్‌ను రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు పెంచుకునేందుకు ఉపయోగించినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా, వాట్సాప్ వంటి డిజిటల్ వేదికల ద్వారా హమీమ్ మండల్‌తో ఆమె నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరి మధ్య జరిగిన చాట్‌లు కూడా దర్యాప్తులో కీలక ఆధారాలుగా లభించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రాథమిక విచారణలో అర్పితా సర్కార్.. ప్రముఖులను హనీ ట్రాప్‌లోకి దింపి వారి పర్సనల్ డేటా, రహస్య సమాచారం సేకరించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె సేకరించిన సమాచారం ఉగ్రదాడుల ప్రణాళికకు ఉపయోగించాలనే ఉద్దేశంతోనే సేకరించారా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. డిజిటల్ ఆధారాలను ఫోరెన్సిక్ నిపుణులు విశ్లేషిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మరోవైపు.. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రయాణించే మార్గాలు, కాన్వాయ్ కదలికలపై కూడా హమీమ్ మండల్ నిఘా పెట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలపై ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని.. అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని స్పష్టం చేశారు. ఈ ఘటనపై స్పందించిన సీఎం సువేందు అధికారి.. ఇది అత్యంత సున్నితమైన అంశమని వివరించారు. నిందితులకు అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌లతో సంబంధాలు ఉండే అవకాశాన్ని కొట్టిపారేయలేమని తెలిపారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్‌తో పాటు సీనియర్ పోలీసు అధికారులు కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

# నీట్ బాధిత కుటుంబాలకు రాహుల్ గాంధీ ఓదార్పు

- ఎక్స్‌లో ఫొటోలు పోస్ట్
- ప్రధాని మోడీపై ప్రతిపక్ష నేత విమర్శలు

అనంతపురం, ఆగస్ట్ 1, అనంత జనశక్తి న్యూస్:



నీట్ పరీక్ష రద్దు కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కలిసి ఓదార్చారు. బాధితులకు సంబంధించిన ఫొటోలను రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తల్లిదండ్రులకు తమ బిడ్డను కోల్పోవడం కంటే బాధాకరమైనది మరొకటి ఉండదని రాశారు. పరీక్షా విధానంపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తి, ప్రధాని మోడీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు.

"ప్రతి యువకుడి మరణం వెనుక తీరని బాధతో ఉండే ఒక కుటుంబం ఉంటుంది. ఇది మన విచ్చిన్నమైన విద్యా వ్యవస్థపై కూడా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయి. పరీక్షలు రద్దవుతున్నాయి. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమవుతోంది. మన విద్యార్థులను నిజాయితీగా కష్టపడమని చెబుతారు. కానీ వారు పనిచేస్తున్న వ్యవస్థ వారితో నిజాయితీగా లేదు." అని పేర్కొన్నారు.

పేపర్ లీక్ కారణంగా తమ పిల్లలను కోల్పోయిన ఏ తల్లిదండ్రులనూ మోడీ కలవలేదని.. భవిష్యత్తు నాశనమైన ఏ విద్యార్థులతోనూ ఆయన కూర్చోలేదని అన్నారు. భారతదేశ విద్యార్థులకు ప్రధానమంత్రి క్షమాపణ అవసరం లేదని.. పైగా ప్రధానమంత్రే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల కన్నీళ్లు, విలాపాల కన్నా గొప్ప దుఃఖం మరొకటి ఉండదని అన్నారు. ఈ దుఃఖం శాశ్వతంగా వెంటాడుతుందని.. దానితో పాటు ఈ విచ్చిన్నమైన, అవినీతిమయమైన విద్యా వ్యవస్థపై అనేక ప్రశ్నలు మిగిలిపోతాయని పేర్కొన్నారు. పేపర్ లీక్‌లు, పరీక్షల రద్దు, సంవత్సరాల తరబడి చేసిన కృషి క్షణాల్లో వృధా అవుతున్నప్పటికీ, విద్యార్థులను నిజాయితీగా పనిచేయమని అడుగుతున్నారని, కానీ వారు పనిచేస్తున్న వ్యవస్థే నిజాయితీగా లేదని అన్నారు. అయినప్పటికీ ప్రధానమంత్రి విద్యార్థులను 'క్షమించడం' గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

# ఈ20 పెట్రోల్‌ను బలవంతంగా రుద్దొద్దు

- మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్
- ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం ఇవ్వాలి

అనంతపురం, ఆగస్ట్ 1, అనంత జనశక్తి న్యూస్:

పెట్రోల్ బంకుల్లో ఈ20 ఇంధనం, స్వచ్ఛమైన పెట్రోల్‌లలో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం వినియోగదారులకు కల్పించాలని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కోరారు. అలాగే ఈ20 మిశ్రమ పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. దిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మిశ్రమ ఇంధనానికి సంబంధించి ప్రధాని మోదీకి వినతి పత్రాలు సమర్పించేందుకు ఆగస్టు 4న ఆయన నివాసం వరకు పాదయాత్ర చేపడతానని ప్రకటించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా పౌరులపై ఈ20 ఇంధనాన్ని ప్రభుత్వం బలవంతంగా రుద్దుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ ఇంధనం కారణంగా ఇథనాల్ దిగుమతులు భారీగా పెరుగుతున్నాయని చెప్పారు. ఈ20 ఇంధనం వాహనాలకు నష్టం కలిగించదని వాదిస్తూ ప్రభుత్వం ఉదహరిస్తున్న ఆ అధ్యయన నివేదికలను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు.



# భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం



- ఉత్తరాంధ్ర అభివృద్ధికి మైలురాయి: మంత్రి అచ్చెన్నాయుడు

భోగాపురం, ఆగస్టు 1: అనంత జనశక్తి న్యూస్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో కీలక ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.ఈ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్రకు అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షితమై పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, పర్యాటకం, వాణిజ్య రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు సాకారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవ కీలకమని కొనియాడారు.ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేసిన రాష్ట్ర, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు శాఖ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద కార్యకర్తలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. లక్షలాది మంది హాజరైన కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో నిర్వహించడం అధికారుల సమిష్టి కృషికి నిదర్శనమని అన్నారు.ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



ధర్మవరం ఆగష్టు 1 అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ ఆదేశాల ప్రకారం అలాగే ఎన్‌డీఏ కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు సూచనల మేరకు, ధర్మవరం పట్టణంలోని 38వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారుల కు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో 38వ వార్డు బీజేపీ ఇన్‌చార్జ్ బిల్లే శ్రీనివాసులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

# సబ్సిడీతో గడ్డి కత్తిరించే యంత్రాలు రైతులు వినియోగించుకోవాలి..

గాండ్లపెంట, ఆగస్ట్, 1, అనంత జనశక్తి న్యూస్,

మండల వ్యాప్తంగా ఉన్న రైతులు, పాడి రైతుల కోసం గడ్డి కత్తిరించే యంత్రాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు పశు వైద్యశాఖ అధికారి చెన్నకేశవ నాయక్ శనివారం తెలిపారు. పశుసంవర్ధక రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించి పశువులకు నాణ్యమైన మేతను సులభంగా సిద్ధం చేసేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డి కత్తిరించే యంత్రం మొత్తం ధర రూ.40,500 కాగా, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందించడంతో రైతులు కేవలం రూ.20,250 మాత్రమే చెల్లించి యంత్రాన్ని పొందవచ్చన్నారు. ఈ యంత్రాల వినియోగంతో మేత తయారీకి పట్టే సమయం, శ్రమ తగ్గడంతో పాటు పశువులకు సమాన పరిమాణంలో మేత అందించేందుకు వీలవుతుందని వివరించారు.

అర్హత కలిగిన రైతులు అవసరమైన పత్రాలతో సమీప పశు వైద్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సబ్సిడీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెన్నకేశవ నాయక్ కోరారు.

# ఒక్కరోజులో రికార్డు స్థాయిలో 2.20 లక్షల లావాదేవీలు

(మొదటిపేజీ తరువాయి)

మీసేవ చరిత్రలో తొలిసారిగా రెండు లక్షల మార్క్‌ను అధిగమించడం రాష్ట్ర ఈగవర్నెన్స్ వ్యవస్థ బలోపేతానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ కార్డు దరఖాస్తులకు అత్యధిక స్పందన లభించగా, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం కూడా భారీ సంఖ్యలో ప్రజలు మీసేవను ఆశ్రయించినట్లు వెల్లడించారు. ప్రజలకు సులభంగా, వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడం వల్లే ఈ స్థాయి ఆదరణ లభించిందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా లక్షలాది లావాదేవీలను విజయవంతంగా నిర్వహించిన మీసేవ బృందాలు, సాంకేతిక నిపుణులు, సంబంధిత శాఖల అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా భవిష్యత్తులో మరిన్ని పౌర సేవలను మీసేవ వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించి సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి పౌరుడు ప్రభుత్వ సేవలను కార్యాలయాల చుట్టూ తిరగకుండా డిజిటల్ విధానంలో సులభంగా పొందేలా మీసేవను మరింత విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. దీంతో తెలంగాణ డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.



# నాలో ఆత్మవిశ్వాసం నింపిన క్షణం

తాను నటనని కెరీర్‌గా ఎంచుకోవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని అంటోంది అందాల తార ప్రీతి ముకుందన్. ఇటీవల 'బ్లాస్ట్', 'హృదయం మురళీ'లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి ఆకట్టుకుంది ప్రీతి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన మొదటి ఆడిషన్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర సంగతిని పంచుకుంది. "మా ఫ్యామిలీలో అందరం చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టే వాళ్లం. మా వాళ్లు చదువులో నన్ను ఎంతగా ప్రోత్సహించేవారో.. నేను నా మనసుకు నచ్చినట్టు కూడా నడుచుకోవాలని అంతే పట్టుదలతో ఉండేవారు. అందుకే కెరీర్ ప్రారంభంలో కొంత కాలం మోడలింగ్ చేశాను. 18 ఏళ్ల వయసులోనే నాకు ఓ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది.

అప్పుడు నటనపై నాకంత నమ్మకం లేక ఆడిషన్ ఇవ్వలేనని చెప్పేశా. కానీ మా అమ్మానాన్న 'నువ్వు ఇది ఎందుకు ప్రయత్నించకూడదు?' అని ఆడిషన్‌కు వెళ్లమని ప్రోత్సహించారు. దాంతో ఆడిషన్‌లో నా వంతు నేను ప్రయత్నించాను కానీ, ఆ పాత్ర దక్కలేదు. కానీ నా తల్లిదండ్రులు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన క్షణమది. చిత్రపరిశ్రమ ఓ కొత్త ప్రపంచం. మా వాళ్లకి దాని గురించి ఏ మాత్రం తెలియదు కానీ, మనసుకి నచ్చింది చేయమని చెప్పడంతోనే నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాతే నెమ్మదిగా నటన పట్ల అభిరుచి పెరిగి, సినిమాని ప్రేమించడం మొదలు పెట్టాన"ని అంది.



# టీజర్ వచ్చేది ఆ రోజే

అగ్ర హీరో నాని నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్న ఈచిత్రంలో కయాదు లోహర్ కథానాయిక. శ్రీకాంత్ ఓదెల దర్శకుడు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. నిర్మాణం తుది దశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈ నెల 6న ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 1నిమిషం 35సెకన్ల నిడివి గల ఈ టీజర్ 'ది ప్యారడైజ్' ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నదని, కథలోని భావోద్వేగాల తీవ్రతను చూపించబోతున్నదని మేకర్స్ తెలిపారు. రాఘవ్ జుయాల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్‌బాబు, తనికెళ్ల భరణి ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈచిత్రానికి కెమెరా: సీహెచ్ బాబు, సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాణం: ఎస్వీఎల్ సినిమా.



# రేణు దేశాయ్ సెకండ్ ఇన్నింగ్స్



ఒకప్పుడు నటిగా తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న రేణు దేశాయ్ చాలా కాలం పాటు వెండితెరకు దూరంగా ఉన్నారు. దర్శకత్వం, రచన, సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించిన ఆమె.. ఇటీవల 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాతో నటిగా రీఎంట్రీ ఇచ్చారు. అయితే ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె పునరాగమనం పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. అయినా నటనపై ఉన్న ఆసక్తిని మాత్రం రేణు దేశాయ్ తగ్గించుకోలేదు. రొటీన్ కమర్షియల్ పాత్రల కంటే నటిగా తన ప్రతిభను చాటుకునే బలమైన పాత్రలను మాత్రమే ఎంచుకోవాలనే ఆలోచనతో ఆమె ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రేణు దేశాయ్ తదుపరి ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తమిళ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ఓంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో లెజెండరీ నటుడు మమ్ముట్టి కూడా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. అందులో మమ్ముట్టికి జోడీగా రేణు దేశాయ్ కనిపించనున్నారనే వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. పేరుకు మాత్రమే పరిమితం కాకుండా, కథను కీలక మలుపు తిప్పే భావోద్వేగభరితమైన పాత్రలో ఆమె కనిపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం దక్షిణాది సినీ పరిశ్రమలో కంటెంట్ ఆధారిత చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తోంది. అలాంటి సమయంలో గ్లామర్ పాత్రల కంటే నటనకు అవకాశం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకోవడం ద్వారా రేణు దేశాయ్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను భిన్నంగా తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# నీట్ పేపర్ లీక్ వల్ల సర్వస్వాన్ని కోల్పోయాను



మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ తన విద్యార్థి దశలో నీట్ పేపర్ లీక్ అవ్వడం వలన పడ్డ కష్టాలను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. సోహా అలీ ఖాన్ నిర్వహించిన 'ఆల్ అబౌట్ హర్' యూట్యూబ్ టాక్ షోలో పాల్గొన్న ఆమె, 2015 నాటి వైద్య ప్రవేశ పరీక్ష (నీట్) పేపర్ లీక్ ఉదంతం తనపై ఎంత తీవ్రమైన మానసిక ప్రభావాన్ని చూపిందో వివరించారు. ఎంతో కష్టపడి ప్రిపేర్ అయిన తర్వాత పరీక్ష రద్దు కావడం, మళ్లీ రాయాల్సి రావడం తన జీవితంలోనే అత్యంత కఠినమైన కాలమని ఆమె తెలిపారు. వైద్య వృత్తిపై మక్కువతో తాను ఎంతో ఇష్టపడే కూచిపూడి నృత్యం, పెయింటింగ్ వంటి వాటిని ఒక సంవత్సర కాలం పాటు పూర్తిగా పక్కన పెట్టానని, తన సంతోషాలన్నింటినీ త్యాగం చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లు కావడంతో మానసికంగా తనకు ఎంతో అండగా నిలిచారని, అయితే సాధారణ విద్యార్థులు పడే ఇబ్బందులను తాను ప్రత్యక్షంగా చూశానని మానుషి వెల్లడించారు. ఎంతోమంది విద్యార్థులు కోచింగ్ కోసం అప్పులు చేసి, వేరే నగరాలకు వెళ్లి చదువుకుంటున్నారని, అలాంటి సమయంలో పరీక్ష మళ్లీ రాయాల్సి రావడం వల్ల విద్యార్థులు ఎంతటి మానసిక ఒత్తిడికి గురవుతారో మాటల్లో చెప్పలేమని అన్నారు. పరీక్ష తేదీ పొడిగించిన ఆ 45 రోజులు మరింత కష్టంగా మారిందని, ఇంకెంత శక్తి మిగిలి ఉందో అనిపించేదని ఆమె గుర్తుచేసుకున్నారు.

# భవిష్యత్తులో వైభవ్ సూర్యవంశీ భారత్‌కు సారథి అవుతాడేమో: ఈస్ట్‌జోన్ సెలక్టర్




వచ్చే దులీప్ ట్రోఫీ కోసం ఈస్ట్‌జోన్ జట్టుకు వైభవ్ సూర్యవంశీ ని వైస్ కెప్టెన్‌గా ప్రకటించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అప్పడే కుర్రాడికి ఇలాంటి అదనపు బాధ్యతలు అవసరమా? అని వ్యాఖ్యలు వినిపించాయి. మరోవైపు వైభవ్ సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇంకా నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయనేది పలువురి సూచన. ఈ క్రమంలో ఈస్ట్ జోన్ సెలక్టర్ ప్రవంజన్ స్పందించారు. తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఈ అనుభవంతో మరింత రాటుదేలతాడని వ్యాఖ్యానించారు.

"మేం వైభవ్ ను సారథి చేయలేదు. వైస్ కెప్టెన్‌గా నియమించాం. మా జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్. వికెట్ కీపర్ కూడా. రోజంతా యాక్టివ్‌గా ఉంటాడు. అంతేకానీ, వైభవ్ సారథ్యం నిర్వర్తించడు. అతడు రోజురోజుకూ పరిణతి చెందుతున్నాడు. ఇలాంటి బాధ్యతలు.. భవిష్యత్తులో అతడికి హెల్ప్ అవుతాయి. వైస్ కెప్టెన్సీ రావడం గొప్ప అవకాశం. దేశం కోసమూ అద్భుతంగా ఆడాలని అతడు కోరుకుంటున్నాడు. ప్రస్తుతం కుర్రాళ్లకు బాధ్యతలు ఇవ్వడాన్ని అత్యంత ముఖ్యమని మేం భావించాం. భవిష్యత్తులో అతడు ఏదో ఒక రోజు టీమ్‌ఇండియాకు కెప్టెన్ అవ్వచ్చేమో" అని ప్రవంజన్ వెల్లడించారు.

కలిసి కట్టుగా నిర్ణయం తీసుకున్నాం.. "ఐపీఎల్‌తోపాటు ఇటీవల భారత జట్టు తరపున వైభవ్ అద్భుత ప్రదర్శన చేశాడు. దేశవాళీలోనూ బిహార్ జట్టుకు వైస్ కెప్టెన్సీని నిర్వర్తించాడు. వైభవ్‌ను నియమించాలని కమిటీ అంతా కలిసి కట్టుగా నిర్ణయం తీసుకుంది. బయట నుంచి ఎవరికి తోచిన విధంగా వారు కామెంట్లు చేస్తున్నారు. అందరూ ఒకేలా ఆలోచించలేరు.

# బుమ్రా ఫిట్

బెంగళూరు: ఇంగ్లండ్ పర్యటనలో గాయపడ్డ భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తాజాగా పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. బెంగళూరులోని సీవోఈలో నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో బుమ్రా పాసయ్యాడని, ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో జరుగబోయే రెండు మ్యాచ్‌ల సిరీస్ కోసం అతడు అందుబాటులో ఉంటాడని బీసీసీఐ ప్రతినిధి ఒకరు తెలిపారు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్స్ (డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌లో భారత్ ఫైనల్ చేరాలంటే తర్వాత ఆడబోయే 9 టెస్టుల్లో ఏడు నెగ్గాల్సిన నేపథ్యంలో లంక సిరీస్‌కు బుమ్రాను ఆడించనున్నారు.



# జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు సిల్వర్

భారత జావెలిన్ స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా.. కామన్‌వెల్త్ క్రీడల్లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో మరో ఇండియన్ అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన చివరి త్రోతో యశ్వీర్ అనూహ్య రీతిలో మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన 28 ఏళ్ల నీరజ్ చోప్రా .. కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెండో అటెంప్ట్‌లో 85.83 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఉంటుందని భావించారు. కానీ పాక్ అథ్లెట్ అనుకోని రీతిలో నిష్క్రమించాడు. ఇటీవల వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరగే సత్తా చాటాడు. అతను జావెలిన్‌ను 89.75 మీటర్ల దూరం విసిరి బంగారం పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

గ్లాస్‌గోలో ప్రస్తుతం చల్లని వాతావరణం ఉన్నది. బలమైన గాలులు కూడా వీస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో జావెలిన్‌ను సుమారు 90 మీటర్ల దూరం వరకు విసరడం అంత సులువైన అంశం కాదు. ఈ సీజన్‌లో జావెలిన్‌ను 90 మీటర్ల మార్క్ దాటించిన ఏకైక క్రీడాకారుడి జాబితాలో రుమేశ్ తరంగ ఉన్నాడు. ఇక ఈవెంట్‌లో 24 ఏళ్ల యశ్వీర్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. తొలిసారి కామన్‌వెల్త్ గేమ్స్ ఆడుతున్న అతను.. అందర్నీ స్టన్ చేస్తూ తన జావెలిన్‌ను 85.41 మీటర్ల దూరం విసిరాడు. తన చివరి ఆరో ప్రయత్నంలో అతను ఆ దూరానికి జావెలిన్‌ను విసిరి ఇండియాకు పతకాల సంఖ్యను పెంచేశాడు.



# కామన్వెల్త్‌లో భారత్‌కు ఒక్క రోజే 25 పతకాల ఛాన్స్

కామన్వెల్త్ గేమ్స్‌లో ఇప్పటి వరకు ఓ లెక్క.. ఇవాళ ఒక్క రోజు మరో లెక్క. ప్రస్తుతం భారత ఖాతాలో 23 పతకాలు చేరాయి. ఇందులో ఐదు బంగారు, 12 రజతాలు, ఆరు కాంస్యాలు ఉన్నాయి. పట్టికలో పదో స్థానంలో కొనసాగుతోంది. తన స్థానంతోపాటు పతకాల సంఖ్యను గణనీయంగా మెరుగుపర్చుకునే అవకాశం ఉంది. ఇప్పటికే పది మంది బాక్సర్లు ఫైనల్‌కు చేరి స్వర్ణాలపై గురి పెట్టారు. ఇవే కాకుండా మరో 15 పతకాలు భారత ఖాతాలో పడే అవకాశం ఉంది. దీంతో మెడల్స్ టాలీలో భారత్ టాప్-5కి కూడా దూసుకుపోవచ్చు. కామన్వెల్త్ గేమ్స్ ఆగస్టు 2తో (భారత కాలమానం ప్రకారం ఆగస్టు 3 ఉదయం) ముగుస్తాయి.

అథ్లెటిక్స్ (8 మెడల్స్)
పురుషుల ట్రిపుల్ జంప్ ఫైనల్ (2 మెడల్స్): ప్రవీణ్ చిత్రావెల్, సెల్వ ప్రభు తిరుమరన్
మహిళల 10వేల మీటర్ల రేస్ వాక్ ఫైనల్ (2): ప్రియాంకా గోస్వామి, రవీనా గైక్వాడ్
పురుషుల పోల్ వాల్ట్ ఫైనల్ (2): దేవ్ కుమార్ మీనా, కుల్‌దీప్ కుమార్
పురుషుల 5వేల మీటర్లు వాక్ ఫైనల్ (1): గుల్వీర్ సింగ్
మిక్స్‌డ్ 4X400 మీ. రిలే ఫైనల్ (1)
పారా అథ్లెటిక్స్ (3 మెడల్స్)
పురుషుల షాట్‌పుట్ ఎఫ్57 ఫైనల్ (2): సోమన్ రానా, శుభమ్ జుయల్
పురుషుల 1500 మీ. టీ54 ఫైనల్ (1): రమేశ్ షణ్ముగం
బాక్సింగ్ (10 మెడల్స్-ఫైనల్స్)
మహిళల 54 కేజీల విభాగం: ప్రీతి
మహిళల 57 కేజీల విభాగం: జాస్మైన్
పురుషుల 55 కేజీల విభాగం: జాదుమణి
మహిళల 51 కేజీల విభాగం: సాక్షి
మహిళల 60 కేజీల విభాగం: ప్రియా
మహిళల 70 కేజీల విభాగం: లొవ్లీనా
పురుషుల 60 కేజీల విభాగం: సచిన్
పురుషుల 80 కేజీల విభాగం: అంకుష్ పంఘాల్
పురుషుల 90 కేజీల+ విభాగం: నరేందర్
జూడో (4 మెడల్స్)..
మహిళల 63 కేజీల విభాగం రౌండ్16: ఉన్నతి శర్మ
పురుషుల 90 కేజీల విభాగం రౌండ్16: కరంజిత్ సింగ్ మాన్
పురుషుల 81 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్: హర్ష్ తోకస్
మహిళల 70 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్: ఇనుంగన్బి తఖెల్లాంబమ్

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314